

పనులు వేగంగా పూర్తి చేయాలి
- అన్నవరం దేవస్థానంలో సౌకర్యాల మెరుగుకు ప్రత్యేక సమావేశం
- సత్యదేవుడిని కుటుంబసభ్యులతో దర్శించుకున్న కాకినాడ జిల్లా కలెక్టర్

7

పాఠశాలల్లో సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

- మెగా పీటీఎం 3.0లో కలెక్టర్ షాన్‌మోహన్
- పాఠశాలల్లో పేరెంట్ టీచర్ మీటింగ్‌లు



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

కాకినాడ రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ప్రతి పాఠశాలలోను శుక్రవారం మెగా పీటీఎం 3.0ను డీఈవో, డీవైఈవోలు, ఎంఈవోలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నిర్వహించగా తల్లిదండ్రులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కాకినాడ పేర్రాజుపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ షాన్‌మోహన్ పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సాలిపేటలోని బాలికల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, డీఈవో పి.రమేష్, ఎంఈవో సీహెచ్ రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ 9వ తరగతి విద్యార్థులకు ట్రయల్ ప్రాజెక్టుగా చేపట్టిన క్లికర్‌ల ద్వారా ఐఎఫ్‌పీల్లో ప్రశ్నలకు జవాబులు ఇచ్చే విధానాన్ని ఎమ్మెల్సీ పరిశీలించారు. డీఈవో మాట్లాడుతూ పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులు తినేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. చర్చి స్క్వేర్ బాలికోన్నత పాఠశాల్లో జరిగిన మెగా పీటీఎంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ ముఖ్యఅతిథిగా పాల్గొని సైన్స్, ఆర్ట్ ప్రదర్శనలను తిలకించారు. ఎంఎస్ నాయకర్ జూనియర్ కళాశాలల్లోనూ మెగా పీటీఎం నిర్వహించారు.

పీటీఎంతో సహృద్భావ వాతావరణం: ఎస్పీ

సర్పవరం జంక్షన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల విద్యాబోధన, విద్యార్థుల సామర్థ్యాలు, విద్యాభివృద్ధికి విద్యాశాఖ నిర్వహిస్తున్న పీటీఎం సమావేశాలతో మంచి ఫలితాలు సాధించవచ్చని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అన్నారు. కాకినాడ రూరల్ రమణయ్యపేట ఏపీఎస్పీ హైస్కూల్లో శుక్రవారం ప్రధానోపాధ్యాయులు సత్యవోలు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్ మీటింగ్(పీటీఎం)-3లో డీఈవో పి.రమేష్‌తో కలసి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో ఈగల్ క్లబ్స్ ఏర్పాటు చేసిన డీఈవో రమేష్‌ను అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ బిందు మాధవ్

విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అందరూ మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా, యువత బానిసలు కావద్దని విద్యార్థులతో ఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో విద్యాక మిటీ చైర్మన్ కర్రి దుర్గాదేవి, ఎస్ఎంసీ సభ్యులు, సర్పవరం సీఐ పెద్దిరాజు పాల్గొన్నారు.

పుష్కర.. గోదారి!



రాజమహేంద్రవరంలో గత పుష్కరాలకు నిర్మించిన అతిపెద్ద కోటిలింగాల ఘాట్

ఇప్పటి నుంచే పుష్కర సన్నాహాలు

- 2027లో గోదావరి పుష్కరాలు
- కోట్లాది మంది భక్తుల అంచనా
- మరిన్ని ఘాట్లకు ప్రతిపాదనలు
- ప్రజాప్రతినిధుల అంచనాలు
- కాకినాడలో 10 ఘాట్లు
- ఉమ్మడి జిల్లాలో పుష్కర సందడి

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

2027 గోదావరి పుష్కరాలకు ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది.12 ఏళ్లకోసారి వచ్చే గోదావరి పుష్కరాలు 2027 జూలై 23 నుంచి ఆగస్టు 3 వరకు నిర్వహించ నున్నారు. కోట్లాది మంది భక్తులు తరలి వచ్చే పుష్కర స్నానాలకు ప్రభుత్వం ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గోదావరి వెంబడి స్నానపు ఘాట్లను భారీస్థాయిలో సిద్ధం చేస్తోం ది. ఒకే సారి లక్షలాది మంది స్నానం చేసేలా ఘాట్లను తీర్చిదిద్దనున్నారు.పుష్కర స్నానాలు రాజమహేంద్రవరం, కొవ్వూరులో అత్యధికంగా జరగనుండగా ఆ తర్వాత కాకినాడ, కోనసీమ జిల్లాల్లో జరగనున్నాయి.



రాజమహేంద్రవరం పుష్కరఘాట్

కాకినాడలో 10 ఘాట్లు

కాకినాడ జిల్లాలో పది ఘాట్లను రూ.5 కోట్లతో సుందరీకరించేందుకు అంచనాలు సిద్ధం చేసింది. పదిలో కాజులూరు మండలంలో రెండు, తాళ్లరేవు మండలంలో 8 ఘాట్లను ముస్తాబు చేయాలని నిర్ణయించింది. ఒక్కో ఘాట్ 15 నుంచి 30 మీటర్ల మేర పొడవుతో నిర్మిస్తోంది. కాజులూరు మండలం పెద్దలంక, అండ్రంగి, తాళ్ల రేవు మండలం పిల్లంక, గోపుల్లంక, గోవలంక వద్ద 20 మీటర్ల పొడవైన ఘాట్లను ఆధునికీకరిస్తోంది. కొత్తగా ఇంజరం, పిల్లంక వద్ద కొత్తలంక పరిధి, తాళ్లరేవు పట్టణం ఐత్రీయ కోరంగి బ్రాంచి వద్ద నందిరేవులో కొత్త స్నానపు ఘాట్‌ను నిర్మించనున్నారు. కోరంగిలో శివాలయం, వేణుగోపాలస్వామి ఆలయాల వద్ద గోదావరిని ఆనుకుని మరో ఘాట్ నిర్మించనున్నారు. తాళ్లరేవు మండలంలో సిద్ధం చేస్తోన్న ఎనిమిది ఘాట్లకు కాకినాడతోపాటు కోనసీమ జిల్లా నుంచి భారీగా పుష్కర స్నానాలకు భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. అఖండ గోదావరి నది సముద్రంలో సంగమించే చివరి ప్రాంతం తాళ్లరేవు, యానాం కావడంతో పుష్కర స్నానాలకు భక్తులు ఇక్కడకు భారీగా వస్తారని భావిస్తు న్నారు.పైగా గోదావరి మూడు పాయలు కలిసే ప్రాంతం ఇక్కడే కావడంతో సెంటిమెంట్‌గా భావించి స్నానాలకు ఇక్కడకు వచ్చే వారు లక్షల్లో ఉంటారని లెక్కలేస్తున్నారు. 2015 పుష్కరాల్లో ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు గోదావరి మూడు పాయలు కలిసే యానాం సమీపంలో పుష్కర స్నానం ఆచరించడంతో ఇక్కడ స్నానమాచరిస్తే మరింత పుణ్యం వస్తుందని ప్రచారం జరిగి అప్పట్లో లక్షల్లో పోటెత్తారు. దీంతో ఈసారి కూడా ఎంత రద్దీ వచ్చినా తట్టుకునేలా ఘాట్లను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే కోనసీమలో కోటిపల్లి, కపిలేశ్వర పురం, యానాం, నగరం, అప్పనపల్లి, ముక్తేశ్వరం, మురమళ్ల, కుండలేశ్వరం, కొత్తపేట, జొన్నాడ, రావులపాలెం తదితర ప్రాంతాల్లో ఘాట్లు ఉన్నాయి. ఈ జిల్లాలో కూడా ఘాట్లు పెంచే యోచనలో ఉన్నారు.

రాజమహేంద్రవరంలో ఒకే ఘాట్ అయ్యేనా?

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో 2027లో జరిగిన గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తుల రద్దీకి తగ్గట్టుగా స్నానాల రేవుల విస్తరణకు ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. గత నెలలో మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో అధికారులు, ఎమ్మెల్యేలతో నూతన ఘాట్లు, ఘాట్ల అనుసంధాన ప్రక్రియపై చర్చించారు.రాజమహేంద్రవరంలో గౌతమి ఘాట్ మొదలుకొని పుష్కరాల రేవు వరకూ ఘాట్లను అనుసంధానం చేసే ప్రక్రియపై ప్రతిపాదనలు ఉన్నాయి.ఈ ఘాట్లు కలుపుతారా విడివిడిగా అభివృద్ధి చేస్తారా అనేది తేలాల్సి ఉంది. రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామ పరిధిలో నాల్గో బ్రిడ్జి కింద నుంచి రెండు అతిపెద్ద వీఐపీ ఘాట్లను నిర్మించాలనే ప్రతిపాదన చేశారు. రాజానగరం నియోజకవర్గం బొబ్బిల్లంక, మునికూడలి ప్రాంతాల్లోనూ ఘాట్లు నిర్మించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి.

కొవ్వూరులో ఇలా..

కొవ్వూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు డివిజన్ పరిధిలో రూ.135.50 కోట్లతో 53 ఘాట్లను సిద్ధం చేస్తున్నారు. కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో 8 రేవులు 1.2 కిలోమీటర్లు మేర రూ.90 కోట్లతో ఒకే ఘాట్‌గా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేశారు. ప్రస్తుతం ఉన్న ఘాట్లను భక్తుల రద్దీకి అనుగుణంగా విస్తరించడంతో, మరి కొన్ని కొత్తఘాట్లను ప్రతిపాదించారు. కొవ్వూరు పట్టణ, మండలంలో పాతవి 20, కొత్తవి 8, తాళ్లపూడి మండలంలో పాతవి 8, కొత్తవి 2, నిడదవోలు పట్టణ, మండలంలో పాతవి 3, కొత్తవి 2, పెరవలి మండలంలో పాతవి 7, కొత్తవి 3 ఘాట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి అందజేశారు.నిడదవోలు మండలం విజ్జేశ్వరం నుంచి సిద్ధాంతం వరకు గోదావరి ఏటిగట్టు రహదారి సుమారు 30 కి.మీ రూ.70 కోట్లతో నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్టు అధికారులు చెప్పారు

మధురపూడి ఎయిర్‌పోర్ట్



అదిగో..ఇండిగో..

వచ్చేస్తోంది!

- ఆకాశంవైపు చూపులు
- ఎంతకీ రాని విమానాలు
- పలు విమానాలు రద్దు
- ప్రయాణికుల ఇక్కట్లు

రాజమహేంద్రవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వియాన ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. విమానాలు గంటల తరబడి ఆలస్యంగా నడుస్తుండడంతో ఎయిర్‌పోర్ట్ ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. ఎప్పుడు విమానం వస్తుందో ఎప్పుడు బయలుదేరుతుందో తెలియక అక్కడే పడిగాపులు కాస్తున్నారు. ఇండిగో విమాన పైలెట్ల రెస్ట్ విషయంలో ఏర్పడిన వ్యవహారంతో కొన్ని విమానాలు రద్దవడంతోపాటు కొన్ని ఆలస్యంగా నడుస్తున్నాయి. దీంతో అనేక మంది ప్రయాణాలు మానుకోగా.. మరికొందరు విమానాశ్రయాల్లో వేచి చూస్తున్నారు. రాజమహేంద్రవరం నుంచి అనేక మంది న్యూఢిల్లీ, ముంబయి, హైదరాబాద్, చెన్నై, బెంగళూరుకు ప్రతిరోజూ వందలాదిమంది విమానాల్లో ప్రయాణిస్తుంటారు. ప్రస్తుతం ఇండిగో విమాన సంస్థలో ఏర్పడిన సమస్యతో సర్వీసులు ఆలస్యమవుతున్నాయి. పైలెట్ల కొరత తెరమీదకు వచ్చింది. ఇండిగో యాజమాన్యం పైలెట్లకు విశ్రాంతి ఇవ్వడంలేదని సమాచారం బయటకు రావడంతో ఎయిర్‌పోర్టు అథార్టీ పైలెట్లకు విశ్రాంతి తప్పనిసరి చేసినట్టు సమాచారం. దీంతో పైలెట్ల కొరత ఏర్పడి విమానాలు రద్దవుతున్నాయి. రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టునుంచి ప్రతి రోజూ హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబయి, న్యూఢిల్లీ 11 విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి. తిరుపతికి రోజు విడిచి రోజు ఒక విమానం వెళ్లొస్తుంది. కానీ గురువారం నుంచి ఆకస్మికంగా విమానాలు రద్దవడం, ఆలస్యం కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం రాత్రి రాజమహేంద్రవరం నుంచి ముంబయి వెళ్లాల్సిన 160మంది ప్రయాణికులు రాత్రంతా విమానాశ్రయంలో జాగరణ చేశారు. రాత్రి 8.30 గంటలకు రావాల్సిన ముంబయి విమానం శుక్రవారం తెల్లవారుజామున 4.30 గంటలకు వచ్చింది. తిరిగి ఐదు గంటలకు వెళ్లింది. ఎయిర్‌పోర్టు, విమాన సంస్థ అధికారులు కొందరు ప్రయాణికులకు రాజమహేంద్రవరంలో హోటల్ రూమ్‌లు బుక్ చేయగా కొందరు ఇళ్లకు వెళ్లి వచ్చారు. రాజమహేంద్రవరం విమానాశ్రయంలో గతంలో ఎన్నడూ ఇటువంటి పరిస్థితి లేదు. ఇక శుక్రవారం న్యూఢిల్లీ, ముంబయి విమానాల సర్వీసు రద్దయింది. బెంగళూరు, చైన్నై, హైదరాబాద్ నుంచి రావాల్సిన విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. బెంగళూరు నుంచి శుక్రవారం ఉదయం రావాల్సిన విమానం అర్ధరాత్రి 12 గంటలకు రావొచ్చని అధికారులు చెబుతున్నారు.దీంతో సుమారు 70 మంది ప్రయాణికులు ఈ రాత్రి కూడా ఎయిర్‌పోర్టులోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. చెన్నై విమానం శుక్రవారం రావాల్సి ఉండగా శనివారం రానున్నట్టు సమాచారం. గురువారం 670మంది ప్రయాణం చేయగా.. శుక్రవారం బాగా తగ్గడం గమనార్హం.

వార్షిక రుణ ప్రణాళిక కింద బ్యాంకర్లు
లక్ష్యాలను చేరుకోవాలి: డీఆర్వో

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వార్షిక రుణ ప్రణాళిక కింద వివిధ రంగాలకు నిర్దేశించిన లక్ష్యాలను బ్యాంకర్లు విధిగా చేరుకోవాలని డీఆర్వో వెంకట్రావు ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన బ్యాంకర్లు, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలాఖరుకు జిల్లాలో రుణ ప్రణాళిక కింద 26,408 యూనిట్లు టార్గెట్ నిర్ణయించగా ఇప్పటివరకు 17,935 యూనిట్లు గ్రౌండ్ చేసి 67.91శాతం చేశారన్నారు. దీన్ని నూరుశాతం చేసేలా బ్యాంకు అధికారులు కృషి చేయాలన్నారు. వ్యవసాయ రంగంలో స్వల్పకాలిక రుణాలుగా రూ.3954కోట్లు, టర్మ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్,యాన్సిలరీ రుణాలుగా రూ.4687 కోట్లు కలిపి రూ.8741కోట్లు రుణాలు రైతులకు పంపిణీ చేశారన్నారు. డీఆర్డీఏ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటివరకు 7,365 డ్వాక్రా సంఘాలకు రూ.519కోట్లు బ్యాంకు రుణాలు పంపిణీ చేయగా మెప్మా ద్వారా 1,982 పట్టణాల్లో సంఘాలకు రూ.301.77కోట్లు రుణాలు పంపిణీ చేశారన్నారు.3,277మంది మహిళా పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు రూ.46కోట్లు రుణాలు ఇచ్చామన్నారు.పీఎం విశ్వకర్మ యోజన ద్వారా 775మంది వృత్తి పనివార్లకు లక్ష నుంచి రెండు లక్షలవరకు రుణాలు కల్పించామన్నారు. పీఎం ఈజీపీ ద్వారా 83 యూనిట్లకు రూ.4.05కోట్లు ఉపాధి రుణాలు, చేనేత కార్మికులకు ముద్రా రుణాల కింద 98మందికి రూ.59కోట్లు మంజూరు చేశామన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ఉపాధి ఆర్థిక ప్రోత్సాహక కార్యక్రమాలపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ద్వారా రూఫ్ టాప్ సోలార్‌ప్లాంట్ల ఏర్పాటుకు జిల్లాలో 6276 దరఖాస్తులు స్వీకరించగా, వీటిలో 2764 దరఖాస్తులకు రూ.23.41కోట్లు రుణాలు అందించామన్నారు. సమావేశంలో యూనియన్‌బ్యాంకు రీజినల్ హెడ్ బీజీఆర్ నాయుడు, ఆర్‌బీఐ ఎల్డీవోపీ రామకృష్ణ, నాబార్డు డీడీఎంవై సోమినాయుడు, ఎల్‌డీఎం సీహెచ్‌ఎస్‌వీ ప్రసాద్, వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్,జిల్లా పరిశ్రమలకేంద్రం జీఎం గణపతి, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసు, మెప్మా పీడీ ప్రియంవద పాల్గొన్నారు.

సముద్ర తీరంలో ప్రమాదాలు లేకుండా
చర్యలు తీసుకోవాలి

- భద్రతపై ప్రత్యేక దృష్టిపెట్టాలి
- జిల్లాస్థాయి కోస్టల్ సెక్యూరిటీ కమిటీ సమావేశంలో డీఆర్వో వెంకట్రావు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సముద్రతీరంలో ప్రమాదాలు చోటు చేసుకోకుండా తీర భద్రతపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టి చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లాస్థాయి కోస్టల్ సెక్యూరిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ సముద్ర తీరంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నందున అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పండుగల సందర్భాల్లో ఎక్కువ సంఖ్యలో ప్రజలు సముద్ర తీరానికి వస్తున్నారని, మత్స్యకారులు వేట సమయంలో ఎలాంటి మరణాలు సంభవించకుండా తీర భద్రతా సిబ్బంది ఇతరశాఖల సిబ్బంది సమన్వయంతో షెడ్యూల్ ప్రకారం పెట్రోలింగ్ చేయాలని అన్నారు. మత్స్యకారులు వేట సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాతావరణ మార్పులపై మత్స్యకార ప్రాంతాల్లో నిరంతరం అవగాహన పెంచాలన్నారు. గజ ఈతగాళ్లు, లైఫ్‌జాకెట్లు అవసరమైన మేరకు అందుబాటులో ఉంచాలన్నారు. కాకినాడ ఎన్టీఆర్‌బీచ్, సూర్యారావుపేట బీచ్, ఉప్పాడ బీచ్‌ల వద్ద మరింత సమర్థవంతంగా భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏపీ మెరైన్ సెక్యూరిటీ పోలీసు అడిషనల్ ఎస్పీ మధుసూదనరావు, ఐబీ అడిషనల్ ఎస్పీ ప్రవీణ్, వాకలపూడి మెరైన్ సీఐ రామ్మోహన్‌రెడ్డి, ఓడలరేవు సీఐ ఎంవీఎస్ఎన్ మూర్తి, పోర్టు సీఐ సునీల్‌కుమార్, పోర్టు ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, అధికారులు దేవకరన్, రాకేష్, ధనుంజయ్ పాల్గొన్నారు.

'క్యూ' చకచకా..
స్టేషన్ సిద్ధమిక..!

- కాకినాడ టౌన్ రైల్వేస్టేషన్ ఆధునికీకరణకు రూ.21.13కోట్ల నిధుల కేటాయింపు
- పూర్తికావొస్తున్న 'అమృత్ భారత్' పనులు
- ఈనెలలోనే పునఃప్రారంభానికి ఏర్పాట్లు

కాకినాడ టౌన్ రైల్వేస్టేషన్లో అమృత్ భారత్ పథకం పేరిట చేపట్టిన అభివృద్ధి పనులు దాదాపు పూర్తి కావొచ్చాయి. రైల్వేస్టేషన్ల ఆధునికీకరణలో భాగంగా అమృత్‌భారత్ రైల్వేస్టేషన్ పథకంలో జిల్లాలోని తుని, సామర్లకోట, కాకినాడ టౌన్ వంటి ప్రధాన స్టేషన్లలో ఈ పనులు పెద్ద ఎత్తున ప్రారంభమై.. ప్రస్తుతం చివరి దశకు చేరాయి.. అధునాతన సౌకర్యాలు, ఆధునిక హంగులతో ముస్తాబవుతున్నాయి. ముఖ్యంగా ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ పనులు 99 శాతం పూర్తయినట్టుగా రైల్వే శాఖ కాకినాడ టౌన్ రైల్వేస్టేషన్‌కు సంబంధించిన దృశ్యాల వీడియోను తమ సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలో పోస్టు చేశారు.

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)



అభివృద్ధి చేసిన కాకినాడ రైల్వేస్టేషన్ బయటి ఆవరణ

కాకినాడ టౌన్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులకు రూ.21.13కోట్లు కేటాయించారు. ప్రారంభంలో నిధుల జాప్యంతో కొంతకాలం పనులు నత్తనడకన సాగాయి. తర్వాత వేగవంతమయ్యాయి. ప్లాట్‌ఫాంల ఆధునికీకరణ, ప్రయాణికులు వేచి ఉండేందుకు ప్రస్తుతం ఉన్న భవనాలతోపాటు అదనంగా మరో రెండు భవనాలను నిర్మించారు. ముఖద్వారాలను, స్టేషన్ పరిధిలోని గోడలను అందంగా తీర్చిదిద్దే పనులు పూర్తయ్యాయి. క్యూలైన్లో నిల్చొనే అవసరం లేకుండా ప్రయాణికులు వెంటనే టికెట్ పొందేందుకు కౌంటర్ వద్ద ఆటోమెటిక్ టికెట్ వెండింగ్ మెషీన్‌ను ఏర్పాటుచేశారు. పాత బల్లలు పూర్తిగా తొలగించి స్టీలు కుర్చీలు ఏర్పాటు చేశారు. ప్లాట్‌ఫాంపై భాగంలో కొత్తషెడ్లు, ద్విచక్రవాహనాల పార్కింగ్‌కు కొత్త షెడ్లు వేశారు. మరింత నాణ్యమైన పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టం, అధునాతన ఎల్ఈడీ బోర్డులను అమర్చారు. ఫుడ్‌కోర్టులు, రైళ్ల రాకపోకల వివరాలు తెలిపే సైన్‌బోర్డులను ఏర్పాటు చేశారు. స్టేషన్ ఆవరణ మొత్తం కాంతిమంతంగా ఉండేలా లైట్లు బిగించారు. స్టేషన్ ఆవరణలోని డివైడర్‌ను పూర్తిగా తొలగించారు. ఐరన్ గ్రిల్స్‌ను అటు ఇటూ వేసి మధ్యలో మొక్కలు పెంచేలా బ్యూటీఫికేషన్ గ్రిల్స్ ఏర్పాటు చేశారు. రామారావు పేట వైపు ఉన్న స్టేషన్ ముందు భాగం పూర్తి రూపురేఖలు మారిపోయాయి. ఆ రహదారిని మొత్తం విశాలవంతమైన ప్రాంగణంగా మార్చేశారు. పార్కింగ్‌కు అనువుగా స్థలం పెంచారు. పచ్చదనాన్ని పెంచేలా, వాటర్ ఫౌంటెయిన్లను ఏర్పాటు చేయనున్నారు. ప్రయాణికులు వేచి ఉండే హాళ్లకు అదనంగా మరో రెండు గదులు నిర్మాణ పనులు పూర్తికావొచ్చాయి. సరికొత్తగా ఫుట్‌పాత్ ఆధునీకరణ, ఫ్రంట్ ఎలివేషన్, స్టేషన్ ఆవరణలో సెంట్రల్ లైటింగ్, పెయింటింగ్ పనులు జోరుగా సాగుతున్నాయి. ప్లాట్‌ఫారాలపై రక్షిత నీరు, మరుగుదొడ్లు, టాయిలెట్లు, విశ్రాంతి గదులు, సామగ్రి భద్రపరుచుకునే విభాగాలు మెరుగుపరుస్తున్నారు. అమృత్ భారత్ రైల్వేస్టేషన్ పథకంలో తొలుత ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని తుని, కాకినాడ టౌన్, నిడదవోలును ఎంపిక చేశారు. 2023, ఆగస్టు 6న ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ఈ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వార్షిక ఆదాయం రూ.20కోట్లకు పైగా ఉన్న ఈ మూడు స్టేషన్లతోపాటు సామర్లకోట, రాజమహేంద్రవరం స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నారు.

కాకినాడలో రెండు

కాకినాడ నగరంలో ప్రధానంగా రెండు రైల్వే స్టేషన్లు ఉన్నాయి. ఒకటి నగరానికి కూతవేటు దూరంలో పోర్టు రైల్వేస్టేషన్, నగర నడిబొడ్డున టౌన్ రైల్వేస్టేషన్. రైళ్లల్లో కూర్చునేందుకు సీటు ఆశించే ప్రయాణికులు, రిజర్వేషన్ దొరకని వారు పోర్టుస్టేషన్‌కు వెళ్తారు. దూరప్రాంతాలు, కాకినాడ చుట్టుపక్కల ఉన్న ఊర్ల నుంచి ఎక్కువ మంది ఇక్కడికి వస్తుంటారు. కాకినాడ నగరంలో రిజర్వేషన్లు చేయించుకుని సీటు దొరికిన వారందరూ టౌన్ రైల్వేస్టేషన్‌కు వస్తుంటారు. కాకినాడ నుంచి 15పాసింజర్ రైళ్లు షిరిడీ, హైదరాబాద్, విశాఖ, విజయవాడ,చెన్నై, బెంగళూరు, తిరుపతి ఇలా పలు ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటాయి. రోజుకు కొన్ని వేల మంది ప్రయాణికులు ఇక్కడినుంచి ప్రయాణాలు చేస్తుంటారు. 30వరకు గూడ్స్ రైళ్లల్లో బియ్యం, బొగ్గు, ఐరన్ ఓర్ వంటివి ఎగుమతి, దిగుమతి అవుతుంటాయి. సామర్లకోట, తుని రైల్వేస్టేషన్లు ప్రధాన సెంటర్లే. వీటి మీదుగా అటు విశాఖ, ఇటు విజయవాడ వైపు అనేక రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. అందుకే ఈ స్టేషన్లు నిత్యం జనంతో కిటకిటలాడుతుంటాయి.

జేసీ రాక ఆలస్యం

- ఇండిగో విమానాల రద్దు ప్రభావమే కారణం

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఇండిగో విమానాల రద్దు కారణంగా కాకినాడకు శుక్రవారం చేరుకోవాల్సిన జిల్లా జేసీ అపూర్వ భరత్ రాలేకపోయారు. శుక్రవారం ఆయన లక్నో విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు చేరుకుని అక్కడినుంచి కాకినాడకు ఆయన ప్రయాణించాల్సి ఉంది. ఇండిగో విమానాల రద్దుతో ఆయన కాకినాడకు చేరుకోలేదు. శనివారం ఆయన కాకినాడ చేరుకుంటారని అధికారులు భావిస్తున్నారు.

తునిలో సినీనటి ఐశ్వర్య రాజేశ్ సందడి

తునిలో సంక్రాంతికి వస్తున్నాం ఫేం, ప్రముఖ సినీ హీరోయిన్ ఐశ్వర్య రాజేశ్, బాల నటుడు రేవంత్ (బుల్లిరాజు) సందడి చేశారు. సౌతిండియా షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవానికి వీరు విచ్చేయగా వీరిని చూసేందుకు స్థానికులు భారీగా వచ్చారు.



షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న ఐశ్వర్య, రేవంత్




పోలీసు శాఖకు వెన్నెముక

నేడు హోంగార్డ్స్ రైజింగ్ డే

కాకినాడ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖకు వెన్నెముక హోంగార్డు వ్యవస్థ. హోంగార్డ్స్ రైజింగ్ డేను ప్రతిఏటా డిసెంబరు 6న జరుపుకుంటారు. 1946లో ముంబయిలో జరిగిన మతపరమైన అల్లర్లను నియంత్రించడానికి పోలీసులకు సహకరించేందుకు తొలుత హోంగార్డులను తీసుకున్నారు. అప్పుడు ఏర్పడిన ఈ వ్యవస్థ శాంతి భద్రతల పరిరక్షణ, వరదలు, అగ్నిప్రమాదాల సమయంలో కీలకమైంది. హోంగార్డుల గుర్తించడం, వారికి గౌరవ మర్యాదలు కల్పించడం, అత్యవసర సమయాల్లో వారి పాత్రను తెలియచెప్పడం వంటివి రైజింగ్ డే ముఖ్య ఉద్దేశ్యం. గతంలో హోంగార్డులను స్వచ్ఛంద రక్షణ దళం అనేవారు. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు, శాంతిభద్రతలు అదుపు తప్పినప్పుడు కానిస్టేబుల్ కన్నా ముందు హోంగార్డు నిలబడతాడు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 1000 మంది హోంగార్డులు ఉండగా వారిలో 400 మంది మహిళే కావడం గమనార్హం. వారి పాత్ర ఎంతో కీలకం. అయితే వారికి వేతనాన్ని ఇప్పటికీ రోజువారీ కూలి మాదిరిగానే ఇస్తున్నారే తప్ప సేవలకు తగ్గ ఫలితం ఉండట్లేదు. సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్నా జీతం రూ.25 వేలకు మించి లేదు. మహిళా హోంగార్డులకు కొన్ని రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తినా చికిత్స చేయించుకునేందుకు ఎటువంటి రాయితీలూ లేవు. ఉన్నతాధికారులు తమకు క్షేత్రస్థాయిలో సంరక్షణ అందించగలిగితేనే నిజమైన రైజింగ్ డే అని హోంగార్డులు చెప్తున్నారు.

తగ్గే దేలే




(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

బంగారం, వెండి ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి.. ఏ మాయ జరుగుతోందో కానీ వీటి ధరలు వెనక్కి తిరిగి చూడట్లేదు. వచ్చే ఏడాది మరింత పెరిగే అవకాశముందని బంగారం వ్యాపార నిపుణుల అంచనా. ఈ ఏడాది జనవరిలోనే కళ్లు తిరిగేలా ధరలు పెరిగాయి. అయితే ధరలు పెరిగే కొద్దీ కొనుగోళ్లు కూడా పెరుగుతుండడం గమనార్హం. జనవరి నుంచి క్రమంగా పెరుగుతున్న బంగారం... ఇటీవల వరలక్ష్మీ పూజ, వినాయ చవితికి పెరుగుతూ వచ్చి, దసరా సమయంలో మరింత పెరిగిపోయింది. అక్టోబరు, నవంబరుల్లోనూ కూడా బాగా పెరిగింది. ఈ నెల ప్రారంభంలో మరింత దూసుకుపోతోంది. బంగారం ధర 22 క్యారెట్ ఒక గ్రాము రూ.11,980గా ఉంది. ఇది రూ.12వేలకు చేరుతుందనే అంచనా ఉంది. 10 గ్రాముల ధర 1,19,800 ఉంది. 24 క్యారెట్ ఒక గ్రాము ధర 13,069. ఈ ఏడాది ఇదే రికార్డు ధర. 10 గ్రాముల ధర రూ.1,30,690కు చేరింది.

ఇక ఈ ఏడాది జనవరి 1న 22 క్యారెట్ 10 గ్రాముల ధర కేవలం రూ.71,150గా ఉంది. 11 నెలల తర్వాత రూ.1,19,800 అయ్యింది. అంటే ఏకంగా 48,650 పెరిగింది.

24 క్యారెట్ ధర జనవరి 1న రూ.78వేలు మాత్రమే ఉంది. ఇవాళ రూ.1,30,690కి చేరింది. అంటే ఏకంగా 52,690 పెరిగింది. సుమారు 11 నెలల వ్యవధిలో బంగారం ధరలు ఇంత రికార్డు స్థాయిలో పెరడం బులియన్ మార్కెట్ చరిత్రలో ఇదే మొదటిసారి.

జనవరిలో బంగారం కొనుగోలు చేసిన వారికి బాగా లాభం వచ్చినట్టే.

వెండి ధరలు కూడా విపరీతంగా పెరిగిపోతున్నాయి. జనవరిలో కిలో రూ.88,400 కాగా ఇవాళ సుమారుగా రెట్టింపు దాటి పెరిగిపోయింది. బుధవారం రూ.1.84 లక్షలు, గురువారం రూ.1.82 లక్షలు కాగా శుక్రవారం కాస్త తగ్గి రూ.1.79 లక్షలకు దిగింది. కానీ మళ్లీ పెరిగిపోయే అవకాశాలున్నాయని చెప్తున్నారు. జనవరి నుంచి ఇప్పటివరకు పెరిగింది 120శాతం వరకు ఉండడం గమనార్హం. వెండి ధర రూ.2లక్షలకు చేరే అవకాశం ఉన్నట్టు మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. వెండి కిలో బార్లకు, నాణేలకు బాగా డిమాండ్ పెరిగింది.

బంగారం, వెండి ధరలు క్రిస్మస్, సంక్రాంతికి మరింతగా పెరిగిపోతాయేమోనన్న ఆందోళన ఉంది. ప్రస్తుత ధరలు వ్యాపారులకు లాభాలు తెస్తుండగా సామాన్య, మధ్య తరగతి ప్రజలకు భారంగా మారాయి. సంపన్నవర్గాలకు పెట్టుబడి సాధనంగా ఉంది.

చుక్కలనంటిన బంగారం ధరలు
22 క్యారెట్ 10 గ్రాములు
రూ.1,19,800
24 క్యారెట్ 10 గ్రాములు
రూ.1,30,690
వెండి కిలో రూ.1.79 లక్షలు



శీతాకాలం ప్రారంభమైంది. ఉషోదయవేళ దారులన్నీ మంచు దుప్పటి కప్పుకుంటున్నాయి. సాయంత్రం వేళ శీతలగాలులు అంతర శరీరాన్ని కుదిపేస్తున్నాయి. దగ్గు, జలుబు పట్టిపీడిస్తున్నాయి. నవంబరు నెల నుంచి ఏటా జరిగే తంతే ఇదంతా. సమశీతోష్ణ స్థితికి అలవాటుపడిన శరీరానికి ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులను తట్టుకోవడం కాస్త ఇబ్బందికరమే. వీటి నుంచి గట్టెక్కేందుకు ఏకైక మార్గం స్వెట్టర్ ధరించడమే.

వెచ్చని నేస్తాలు





» ప్రజలను వణికిస్తున్న చలి » సాయంత్రం ఐదు గంటల నుంచే శీతలగాలులు » ఉన్ని దుస్తులకు పెరుగుతున్న డిమాండ్ » ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చి విక్రయం

(సామర్లకోట-ఆంధ్రజ్యోతి)

చలికాలం ప్రారంభమైంది. బయటకు రావడానికి భయపడేలా ప్రజలను చలి వణికిస్తోంది. వారం రోజులుగా చలి తీవ్రత పెరుగుతూ వస్తోంది. సాయంత్రం ఐదు గంటలకే చల్లటి గాలులు ప్రారంభమవుతున్నాయి. ఉదయం ఎనిమిది గంటల దాకా మంచు దుప్పట్లు తొలగట్లేదు. పెరుగుతున్న చలితో వృద్ధులు, చిన్నారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. చలి తీవ్రతను తట్టుకునేందుకు ఉన్ని దుస్తులను ధరించడం కంటే మరో మార్గం కనిపించట్లేదు. ప్రజల అవసరాలకు అనుగుణంగా కాకినాడ నగరంతో పాటు సామర్లకోట పట్టణంలో పలు ఉన్ని దుస్తుల దుకాణాలు వెలిశాయి. మధ్యప్రదేశ్, లూధియానా, సిమ్లా, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, మహారాష్ట్ర నుంచి ఉన్ని దుస్తులు తెచ్చి రహదారుల పక్కన విక్రయిస్తున్నారు. రగ్గులు, చలికోట్లు, మంకీ క్యాప్‌లు, హ్యాండ్ గ్లౌజ్‌లు, మఫ్లర్లు, తలపాగాలు రకరకాల సైజుల్లో రంగు రంగుల్లో లభిస్తున్నాయి. ధరలు అధికంగా వున్నా చిన్నారులతో పాటు పెద్దలు కూడా వాటిని కొనుగోలు చేస్తున్నారు.



సామర్లకోట-పెద్దాపురం రోడ్డులో ఉన్ని దుస్తుల విక్రయం





మోడల్ మంకీ క్యాప్‌లు, హెడ్ బ్యాండ్‌లు



కాకినాడలో ఉన్ని దుస్తులు కొనుగోలు చేస్తున్న మహిళ

ఎర్రజెండా ఒక్కటే రాజకీయ ప్రత్యామ్నాయం

» చంద్రబాబు, పవన్‌కల్యాణ్ రాష్ట్ర ప్రయోజనాలను మోదీ ప్రభుత్వానికి తాకట్టు పెడుతున్నారు
» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఎన్నికల్లో దేశ, రాష్ట్ర ప్రజలకు ఎర్రజెండా ఒక్కటే రాజకీయ ప్రత్యామ్నాయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య అన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాష్ట్ర ప్రయోజనాలను మోదీ ప్రభుత్వానికి తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రుల హక్కు విశాఖపట్నం ఉక్కు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయడానికి ప్రయత్నం చేస్తుంటే రాష్ట్రంలోని 25 మంది ఎంపీలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. నోట్ల రద్దు సమయంలో ప్రధాని మోదీ రూపాయి విలువపై ఘనమైన ఉపన్యాసాలు ఇచ్చారని, కానీ డాలర్‌తో పోల్చితే దారుణంగా పడిపోయిందన్నారు. దీని ప్రభావం, శ్రామికజనంపై ఎంత భారం పడుతుందో పార్లమెంట్‌లో ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. 2014 నుంచి ఇప్పటి వరకూ రూ.150 లక్షల కోట్లు అప్పులు చేసి అప్పుల భారతాన్ని సృష్టిస్తున్నారని, దీన్నుంచి బయట పడడానికి కులం, మతం, ప్రాంత వైషమ్యాలు సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. చంద్రబాబు 2047 నాటికి వికసిత్ ఆంధ్రప్రదేశ్ అంటూ గొప్పలు చెబుతున్నారని, అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ఒక్క పెన్షన్లు తప్ప ఏం సాధించారని, నిరుద్యోగ భృతి, మహిళకు ఆర్థిక సాయం, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఎక్కడ అని ప్రశ్నించారు. రైతుల సమస్యలపై ఈ నెల 10న, వైద్య విద్య ప్రైవేటీకరణ నిరసిస్తూ 18న రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామన్నారు. శతాబ్ది చరిత్ర నేపథ్యంలో 3,600 కమ్యూనిస్టు శాఖల్లో సీపీఐ ఆవిష్కరణ సభలు నిర్వహిస్తామన్నారు. దేశవ్యాప్తంగా 5లక్షల మందిని సమీకరించి నూతన రాజకీయ ప్రత్యామ్నాయ దిశగా జనవరి 18న ఖమ్మంలో సీపీఐ భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని, పార్టీ పునర్వైభవం దిశగా, ప్రజలను భాగస్వాములు చేస్తూ, భవిష్యత్ పోరాటాలకు వేదిక చేసుకుంటామని ఈశ్వరయ్య పేర్కొన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తాటిపాక మధు, జిల్లా కార్యదర్శి రేఖ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ దేశాల్లో భారత్ సూపర్ పవర్

» కొల్లాపూర్ శివాజీ యూనివర్శిటీ ప్రొఫెసర్ సోంకవాడే
» నన్నయలో అంతర్జాతీయ సదస్సు



అంతర్జాతీయ సదస్సు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాల్లో భారత్ సూపర్ పవర్ కలిగిన దేశమని కొల్లాపూర్ శివాజీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఆర్‌జీ సోంకవాడే అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని రసాయనశాస్త్ర విభాగం, హైదరాబాద్‌లోని అయోంకి పబ్లిష్కో సంయుక్త ఆధ్వర్యంలో భౌతిక, రసాయన, జీవ శాస్త్రాల్లో నూతన ఆవిష్కరణలు: వ్యవసాయ-ఆహార సాంకేతికత, ఔషధ ఆవిష్కరణ, పర్యావరణ స్థిరత్వంలో వాటి ఉపయోగాలు అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఆర్‌జీ సోంకవాడే ఆన్లైన్‌లో కీలక ఉపన్యాసం ఇచ్చారు. 67 శాతం యువత ఉన్న మన దేశంలో సాంకేతికపరమైన వినూత్న ఆలోచనలకు అవకాశాలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ఎలక్ట్రికల్ వాహనాలు ప్రమాదానికి గురికావడానికి యాంత్రిక ఒత్తిడి, ఉష్ణోగ్రత, తేమ, కలుషితాలు కారణమవుతున్నాయని చెప్పారు. ఉపయోగంలో లేని బ్యాటరీలను సరియైన పద్ధతిలో డిస్పోజ్ చేయాలని పర్యావరణ హితానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఈ అంతర్జాతీయ సదస్సుకు దేశ విదేశాల నుంచి 300 మంది హాజరవుతున్నారని సదస్సు చైర్మన్, అయోంకి పబ్లిష్కో సంస్థ చైర్మన్ ప్రొఫెసర్ చంద్రమౌళి పావులూరి తెలిపారు. ఈ సందర్భంగా వీసీ ఎస్.ప్రసన్నశ్రీ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతికతలో వేగవంతమైన పురోగతులు, సహజ ప్రక్రియలపై అవగాహనను మరింత పెంపొందించేందుకు ఇటువంటి సదస్సులు దోహదపడతాయన్నారు. సదస్సుకు సంబంధించిన వంద పరిశోధన పత్రాలతో ముద్రించిన పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, సదస్సు కన్వీనర్ ఆచార్య బి.జగన్మోహనరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి, రసాయన విభాగాధిపతి కె.దీప్తి తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న అన్నదాన పథకానికి రూ.5 లక్షల విరాళం



వేంకటేశ్వరస్వామి అన్నదానానికి విరాళం అందిస్తున్న దాతలు

ఆత్రేయపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో చేపడుతున్న నిత్య అన్నదాన పథకానికి నిడదవోలు మండలం పురుషోత్తపల్లికి చెందిన ముళ్లపూడి వెంకటసుబ్బారావు- లక్ష్మి రజని, ముళ్లపూడి శివరామకృష్ణ-సాయిశృతి దంపతులు రూ.5 లక్షలు విరాళం సమర్పించారు. దాతలకు ఆలయ ఉపకమిషనరు ఈవో నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు. శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు.

గ్రంథాలయ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి

ఉమ్మడి జిల్లా సంఘం అధ్యక్షుడు వర్మ



జిల్లా కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

కాకినాడ సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థలో పని చేస్తున్న అర్హత కలిగిన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జీవీఆర్‌ఎస్‌హెచ్ వర్మ పేర్కొన్నారు. కాకినాడలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం జరిగిన ఉద్యోగుల సంఘం రెండో కార్యవర్గ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘంలో చేర్చుకునేందుకు తీర్మానం చేశారు. అలాగే సంస్థలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలపై జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకట్రావుకు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో అసోసియేట్ అధ్యక్షుడు రేపాక వెంకటరావు, ప్రధాన కార్యదర్శి డొక్కా రాజు, సలాది సాయి సత్యనారాయణ, ములంపాక శ్రీనివాసరావు, జీవీవీఎస్ త్రినాథ్, కె.కిషోర్, కె.శ్రీనివాస్, సలాది రాజు, కె.పద్మజ, బి.రత్నమణి, బి.నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

అక్నూ.. పీజీలో మిగిలిన సీట్లు మేనేజ్‌మెంట్ కోటాలో భర్తీ

సర్పవరం జంక్షన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ తిమ్మాపురం అక్నూ ఎంఎస్‌ఎన్ పీజీ క్యాంపస్‌లో మొదటి, రెండో కౌన్సెలింగ్ అనంతరం మిగిలిపోయిన సీట్లను మేనేజ్‌మెంట్ కోటా ద్వారా భర్తీ చేయనున్నట్టు ప్రిన్సిపాల్ ఎస్ ప్రశాంతశ్రీ ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి స్పాట్ అడ్మిషన్ల ద్వారా సీట్లు భర్తీ చేసేందుకు ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అనుమతి ఇచ్చిందన్నారు. దీనిలో సెట్ అర్హత లేని, ఏపీ పీజీ సెట్-2025 పరీక్ష రాయని అర్హులైన అభ్యర్థులతో సీట్లు భర్తీ చేస్తామన్నారు. మేనేజ్‌మెంట్ కోటా కింద ఎంఏ ఇంగ్లీష్, ఎంఏ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎంఏ ఎకనామిక్స్, ఎంకామ్, ఎమ్మెస్సీ మ్యాథ్స్ కోర్సుల్లో సీట్లు భర్తీ చేస్తామన్నారు. వీరికి ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం వర్తించదన్నారు. ఇతర వివరాలకు 97018 27564 నెంబరును సంప్రదించాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

భీమేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు రూ.1.5 లక్షల విరాళం

ద్రాక్షారామ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు శుక్రవారం ఇద్దరు దాతలు రూ 1.5 లక్షలు విరాళం సమకూర్చారు. ద్రాక్షారామకు చెందిన యనమండ్ర భీమశంకరం, మాణిక్యాంబ దంపతులు రూ.1 లక్ష, శ్రీదర్భసూర్య సుబ్రహ్మణ్యం రూ.50 వేలు విరాళం ఆలయ సహాయ కమిషనర్ ఏవీ దుర్గాభవానీకి అందజేశారు. దాతలకు ఆమె స్వామివారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

12న ఉమ్మడి జిల్లా కార్మికుల సదస్సు



ఉమ్మడి జిల్లా సదస్సు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గొల్లప్రోలు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నిర్మాణ రంగంలో ఉన్న కార్మికుల సమస్యలపై చర్చించేందుకు ఏఐటీయూసీ అనుబంధ ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 12న కాకినాడ పీఆర్ భవన్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ తెలిపారు. గొల్లప్రోలులో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలు, పోస్టర్లను నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్మాణదారుల నుంచి సెస్‌లు వసూలు చేస్తున్న ప్రభుత్వం ఆ నిధులను భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి వినియోగించడం లేదని విమర్శించారు. కోట్లాది రూపాయిల క్లెయిమ్ బకాయిలు పేరుకుపోయాయని తెలిపారు. ప్రమాదవశాత్తూ మృతిచెందిన భవన నిర్మాణ కార్మికులకు రూ.10 లక్షలు వంతున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అనిశెట్టి నూకరాజు, ఎం.గంగబాబు, చేదులూరి రత్నాజీ, మొగలి వరప్రసాద్, కోలా వీరబాబు, ఎస్.సత్తిబాబు, శ్రీను, నూకరాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

'శంబాల..హర్రర్, సోషల్ ఫ్యాంటసీ సినిమా'



ఐఎస్‌టీఎస్‌లో సందడి చేస్తున్న సినీ నటులు

రాజానగరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): హర్రర్, సోషల్ ఫ్యాంటసీ ఎలివేషన్లతో, మంచి కథతో శంభాల సినిమాగా మీ ముందుకు వస్తున్నామని హీరో ఆది అన్నారు. శంభాల మూవీ సినీ బృందం తూర్పుగోనగూడెంలోని ఐఎస్‌టీఎస్ కళాశాలకు శుక్రవారం విచ్చేసింది. వారికి కళాశాల చైర్మన్ కళ్లెం ఉపేందర్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హీరో ఆది మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులతో కలిసి థియేటర్‌కు వెళ్లి సినిమా చూసి ఆదరించాలని కోరారు. హీరోయిన్ అర్చన మాట్లాడుతూ ఈ నెల 25న శంభాల మూవీ విడుదల కాబోతుందని అందరూ తిలకించాలన్నారు. నటుడు ఇంద్రనీల్ ఈ సినిమాలోని డైలాగ్స్ చెప్తూ అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి సినిమాలోని పలు పాటలకు స్టెప్పులు వేసి అలరించారు.

ఖైదీలకు ఉచిత న్యాయసేవలు

డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

రాజమహేంద్రవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఖైదీల తరఫున కోర్టులో ఉచితంగా వాదించడానికి న్యాయవాదుల సేవలు అవసరమైనా, బెయిల్ పిటిషన్లు దాఖలు, హైకోర్టుల్లో అప్పీలు వేయాల్సి ఉన్నా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సహకరిస్తుందని సంస్థ కార్యదర్శి శ్రీలక్ష్మి స్పష్టం చేశారు. శుక్రవారం సెంట్రల్ జైలును ఆమె సందర్శించారు. ఆహార ప్రమాణాలు, వైద్య సేవలను, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి న్యాయ సహాయం గురించి వివరించారు. నిందితులు, ఖైదీల న్యాయ పరిరక్షణ కోసం పని చేస్తున్న లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సేవలను కూడా వినియోగించుకోవాలని సూచించారు.

నేడు సామర్లకోటకు సమాచార శాఖ కమిషనర్

సామర్లకోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ చావలి సునీల్ శనివారం కాకినాడ జిల్లా పర్యటనలో భాగంగా సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని డీఆర్వో జె.వెంకట్రావు శుక్రవారం రాత్రి తెలిపారు. ఈ మేరకు తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో ఈవో బళ్ల నీలకంఠం, పండితులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

చెస్‌లో రవిశంకర్ ప్రతిభ

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆలిండియా చెస్ రేటింగ్స్‌లో రాజమహేంద్రవరానికి చెందిన వనం రవిశంకర్ 1506 ర్యాంకు సాధించాడని కోచ్ వరద సురేష్ ఓ ప్రకటనలో తెలిపారు. తమ కుమారుడు సురేష్ చెస్ అకాడమీలో ఆరు నెలలుగా శిక్షణ పొందుతున్నాడని రవిశంకర్ తల్లిదండ్రులు తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం



సత్యనారాయణ(ఫైల్)

ఆత్రేయపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవ్వరికి చెప్పకుండా అదృశ్యమైన వ్యక్తి గోదావరిలో శవమై కనిపించాడు. వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పులిదిండికి చెందిన వల్లి సత్యనారాయణ(60) గత నెల 27న ఎవ్వరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు బంధుమిత్రుల ఇళ్లకు వెళ్లి వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఈ నేపథ్యంలో సత్యనారాయణ మనువడు చక్రి గతనెల 30న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ నిర్వహించారు. శుక్రవారం పేరవరం వద్ద గౌతమి గోదావరి నదీలో సత్యనారాయణ మృతదేహం లభ్యమైంది. దీంతో పోలీసులు వెళ్లి విచారణ నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాము పేర్కొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన వ్యక్తులపై కేసు

జగ్గంపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేటలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన పలువురిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసినట్లు జగ్గంపేట ఎస్సై టీ.రఘునాధరావు తెలిపారు. గోకవరం రోడ్డులోని పోలవరం కాలువ, డిగ్రీ కళాశాల సమీపంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న పలువురుని అదుపులోకి తీసుకున్నామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే ఉపేక్షించేదిలేదని, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గడ్డివాములో మృతదేహం లభ్యం

కపిలేశ్వరపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలంలోని వాకతిప్ప గ్రామశివారులో గురువారం రాత్రి గడ్డివాములో వ్యక్తి మృతదేహం లభ్యమైంది. శుక్రవారం అంగర ఎస్ఐ హరీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... వాకతిప్ప గ్రామశివారులో గడ్డివాము వద్ద గుర్తు తెలియని పురుష మృతదేహం ఉన్నట్టు తమకు వచ్చిన సమాచారం మేరకు ఆ ప్రాంతాన్ని సిబ్బందితో పరిశీలించినట్టు తెలిపారు. దీనిపై పక్క మండలాలకు సమాచారం ఇవ్వగా రామచంద్రపురం గ్రామానికి చెందిన గుబ్బల రమణ(59)గా గుర్తించారు. మృతుడు రామచంద్రపురంలోని ఓ ప్రైవేటు కాలేజీ నందు బస్సు

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

క్లీనర్‌గా పనిచేసేవాడు. బస్సు కోరుమిల్లి గ్రామంలో ఉంచి అక్కడే నిద్రించేవాడు. గతనెల 27 నుంచి కనపించడంలేదు. అతడి చుట్టుపక్కల గాలించిన ఆచూకీ లభ్యం కాలేదు. గురువారం రాత్రి గ్రామశివారులో డి.మణికంఠ పొలం గడ్డివాము దగ్గర రమణ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి బావమర్ది గుత్తుల శ్యామ్ మృతదేహాన్ని రమణగా గుర్తించాడు. అనంతరం పోలీసులు ఫిర్యాదు చేయగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ హరీష్‌కుమార్ తెలిపారు.

బాలికకు వేధింపులు...

ఐదుగురు వ్యక్తులపై పోక్సో కేసు

రాజోలు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బాలికను వేధించిన కేసులో ఐదుగురు వ్యక్తులపై పోక్సో కేసు నమోదు చేశామని రాజోలు ఎస్ఐ బి.రాజేష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలంలో ఓ గ్రామానికి చెందిన ఓ మహిళ గత పదేళ్లుగా తాటిపాకలో బ్యూటీపార్లర్ నిర్వహిస్తుంది. ఆమెకు బాలిక ఉంది. అయితే ఆ మహిళతో రాజోలుకు చెందిన జీడీ ప్రసాద్ సహజీవనం చేస్తున్నాడు. ప్రసాద్ సదరు మహిళ కూతరు పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండడంతో ప్రసాద్‌కు వారు దూరంగా ఉంటున్నారు. గత నవంబరు 2న ప్రసాద్ తన స్నేహితులైన సీహెచ్ రాంబాబు, కె.బాబి, ఎస్.అరుణ్‌తేజ, రామాంజనేయును వెంట తీసుకుని మహిళ ఇంటికి వెళ్లి బెదిరింపులకు గురిచేశారు. దీంతో ఆమె రాజోలు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఐదుగురిపై పోక్సో కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశామని ఎస్ఐ రాజేష్‌కుమార్ పేర్కొన్నారు.

కులాన్ని మార్చేశారు...

కాకినాడకు చెందిన కానిస్టేబుల్ ఫిర్యాదు

కాకినాడ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో తన కులాన్నే మార్చేశారని ఓ కానిస్టేబుల్ కలెక్టర్, డీఆర్వోలకు ఫిర్యాదు చేశాడు. వివరాలోకి వెళ్లితే కాకినాడకు చెందిన జగదీష్ అనే కానిస్టేబుల్ తన కులాన్ని ఆన్‌లైన్‌లో కుట్రపూరితంగా మార్చేశారని అధికారులకు ఫిర్యాదు చేశాడు. డిఐజీ సంతకాన్ని ఫోర్జరీ చేసి సస్పెన్షన్‌కు గురైన జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ కామేశ్వరరావు కాకినాడ 32 ఏ సచివాలయ మహిళా వీఆర్వోతో కలిసి ఈ కుట్రకు పాల్పడ్డారని జగదీష్ ఆరోపించాడు. బీసీ కులస్తుడిగా ఉన్న తనను ఓసీ కులస్తుడిగా మార్చి తన ఉనికిని ప్రశ్నార్థకం చేశారని వాపోయాడు. సుమోటా కేస్ట్ సర్వేలో భాగంగా కుల పరిశీలన చేస్తున్న నేపథ్యంలో అదే అవకాశంగా సర్వేలో లొసుగులు వినియోగించుకుని తన కులాన్ని మార్చినట్టు పేర్కొన్నాడు. ఓటీపీ వస్తుందని ముందుగానే తెలిసి తొలుత తన ఫోన్ నెంబర్ మార్చి ఆపై కులం పేరు మార్చారన్నాడు. రెవెన్యూశాఖ ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి తక్షణం విచారణ చేపట్టాలని, తన కులాన్ని ఎలా మారుస్తారని ప్రశ్నించాడు. నేరానికి పాల్పడిన కామేశ్వరరావుతో పాటు సహకరించిన మహిళా వీఆర్వోపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరాడు.

సూక్ష్మ సింబల్... సూపర్!



అమలాపురం టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు నేరుగా అందజేసేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన సూక్ష్మాతి సూక్ష వస్తువుల తయారీ నిపుణుడు తాలాబత్తుల బ్రహ్మజీ గ్లాసు గుర్తుపై పార్టీ సింబల్‌ను సూక్ష్మంగా తయారుచేశాడు. రోజు వ్యవధిలో 0.550 మిల్లీగ్రాముల వెండిని ఉపయోగించి సెంటీమీటరు ఎత్తు, 0.75 సెంటీమీటర్ల వెడల్పుతో సింబల్‌ను తయారుచేసినట్టు బ్రహ్మజీ తెలిపారు. పార్టీ సింబల్‌పై జెండాను సైతం సూక్ష్మంగా చెక్కారు. త్వరలో పవన్‌ను కలసి సూక్ష్మ వస్తువును అందజేయనున్నట్టు తెలిపారు. బ్రహ్మజీ ఇప్పటికే 37 సూక్ష్మ వస్తువులనుచేసి జాతీయ, అంతర్జాతీయస్థాయిలో పలు అవార్డులు, రికార్డులు దక్కించుకున్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలకు యత్నం

లంకల గన్నవరంలో రెండు ఎక్స్‌కవేటర్లు, రెండు లారీలు స్వాధీనం



పి.గన్నవరం పోలీస్‌స్టేషన్ వద్ద రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న ఎక్స్‌కవేటర్, చట్రులారీ



పి.గన్నవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గోదావరికి వరదలు కాలం ముగియడంతో తీరం వెంబడి ఇసుక, మట్టి తవ్వకాల కోసం మాఫీయా సిద్ధమవుతుంది. ఈ క్రమంలోనే డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం వైవి పాలెం దిగువున లంకల గన్నవరం పరిధిలో ఇసుక తవ్వకాలు నిమిత్తం ర్యాంపు ఏర్పాటుకు కొంతమంది మాఫీయా పెద్దలు శుక్రవారం రంగం సిద్ధం చేసుకుని బాట పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ పి.శ్రీపల్లవి రెవెన్యూ సిబ్బందికి ఆదేశాలు జారీ చేయడంతో ఆర్ఐ డాంగే, సిబ్బంది బాట పనుల వద్దకు చేరుకుని రెండు ఎక్స్‌కవేటర్లు, చట్రుతో వచ్చిన 2 లారీలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రస్తుతం యంత్రాలను పోలీసులకు అప్పగించామని, విచారణ అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ స్పష్టం చేశారు. అలాగే మొండెపులంకలో రాత్రివేళల్లో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలు అడ్డుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇదిలా ఉండగా ఇసుక తవ్వకాలకు తమకు అనుమతులు ఉన్నాయని విజయవాడ నుంచి రాము పంపించారని బాట పనులు వద్ద ఉన్న కొంత మంది నిర్వహకులు ఆర్ఐకు సూచించారు. దీంతో గోదావరి తీరాన్న పెద్దఎత్తున ఇసుకను తరలించేందుకు మాఫీమా పెద్దలు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తుంది. అలాగే రాత్రి వేళల్లో అనుమతులు లేకుండా లంకలగన్నవరంలో బొండుఇసుక, మొండెపులంకలో ఇసుకను తరలిస్తున్నారని స్థానికులు చెప్తున్నారు. వారం వ్యవధిలో పోలీసులు 2 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని జరిమానా విధించి పంపివేశారు.

కాకినాడలో 104 ఉద్యోగుల ఆందోళన



కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న 104 ఉద్యోగులు

జీజీహెచ్ (కాకినాడ), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): 104 నిర్వహణ సంస్థ భవ్య యాజమాన్యం చట్టవ్యతిరేకంగా ఇచ్చిన షోకాజ్ నోటీస్‌ను తక్షణం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రాత్రి కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో 104 ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షకార్యదర్శులు దువ్వా శేషబాబ్జి, చెక్కల రాజ్‌కుమార్ మాట్లాడుతూ పిఠాపురం మండలం మల్లం పీహెచ్‌సి పరిధిలోని 104 వాహనంలో గత 6 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న రాంబాబును భవ్య యాజమాన్యం ఉద్దేశపూర్వకంగా విధులకు సంబంధంలేని అంశాలపై ఆరోపణలు చేస్తూ షోకాజ్ నోటీసులు ఇవ్వడం కార్మిక చట్టాలకు విరుద్ధమని విమర్శించారు. భవ్య సంస్థ వచ్చాక వేతనాలను తగ్గించారని ఆరోపించారు. 104 వాహనాలు పూర్తిస్థాయిలో తిరగకపోయినా తిరుగుతున్నట్టు చూపించి ప్రభుత్వ నిధులు దోచుకుంటున్నారన్నారు. దీనిపై అధికారులు సమగ్ర విచారణ జరిపి భవ్య యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ ధర్నాకి యునైటెడ్ మెడికల్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రత్నరాజు,చీకట్ల శ్రీనివాస్ మద్దతు తెలిపారు.



వర్ణాల చిత్రం సూర్యోదయం వేళ ఆకాశం రంగుల వర్ణమైంది.. అందాల శోభ సంతరించుకుంది. కాకినాడ-పందూరు రహదారిపై కనిపించిన ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి కెమెరా' క్లిక్ మనిపించిందిలా.. - స్టాఫ్ ఫొటోగ్రాఫర్ కాకినాడ



ప్రథమ చికిత్స కిట్ల పంపిణీ

కార్పొరేషన్ (కాకినాడ), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆర్టీసీ డిపోలోని అన్ని బస్సులకు అవసరమైన ప్రథమ చికిత్స కిట్లను రంగా డిజిటల్స్ తరపున స్పాన్సర్ చేశారు. ఆ సంస్థ అధినేత పి.రంగా మొత్తం 165 ఫస్ట్ ఎయిడ్ కిట్లను డిపో అధికారులకు శుక్రవారం అందజేశారు. జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజరు టి.బాలకృష్ణ, పీఆర్వో సీహెచ్ వెంకట్‌రాజు పాల్గొన్నారు.



ఉప్పాడ కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు



కరపలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంతం నానాజీ



సామర్లకోటలో విద్యార్థికి స్కాట్ దుస్తులు అందజేస్తున్న విద్యా శాఖ ఏడీ మహ్మద్ షరీఫ్

తల్లిదండ్రుల మాట వినండి... బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోండి

విద్యార్థులకు డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు పిలుపు

జిల్లావ్యాప్తంగా పాఠశాలల్లో ఘనంగా మెగా పేరెంట్-టీచర్ మీట్

కొత్తపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తల్లిదండ్రుల మాట విని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) విజ్ఞప్తి చేశారు. ఉప్పాడ కొత్తపల్లి వీర్రాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్స్ మీట్‌లో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల చదువు బాధ్యతను ఉపాధ్యాయులే కాకుండా ఇళ్ల వద్ద తల్లిదండ్రులు కూడా తీసుకోవాలని రామస్వామి కోరారు. పిఠాపురం నియోజకవర్గంలో ఐదారు సెంటర్ల ద్వారా రుచికరమైన మధ్యాహ్న భోజనం తయారు చేయించి పాఠశాలలకు పంపిణీ చేయాలనే ఉద్దేశ్యంతో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఉన్నారని చెప్పారు. జనసేన వైద్య విభాగం ప్రతినిధి, సురక్ష మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చల్లా లక్ష్మి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గండి కొండలరావు, జనసేన నాయకులు తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, ఉప్పాడ కొత్తపల్లి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రావు చిన్నారావు, సర్పంచ్‌లు ఉమ్మిడి మేరీజాన్, నక్కా మణికంఠ, పులి జయబాబు, ఫైవ్‌మెన్ కమిటీ సభ్యులు ఓదూరి కిషోర్, గంటా విజయకుమార్, మత్సా అప్పాజీ, వేగిశెట్టి సూర్యనికిల్ పాల్గొన్నారు.

కరప (ఆంధ్రజ్యోతి): కరప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరేంట్స్ టీచర్ మీట్‌కు ఎమ్మెల్యే పంతం నానాజీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ప్రత్యేకంగా సమావేశమై విద్యార్థుల ప్రగతిపై సమీక్షించారు. పోటీ పరీక్షలు, ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అధికారులు, స్వచ్ఛంద సంస్థల ద్వారా బహుమతులు, నగదు ప్రోత్సాహకాలు, సైకిళ్లను ఎమ్మెల్యే అందజేశారు. ఎగ్జిబిషన్‌ను వీక్షించి అభినందనలు తెలిపారు. భవిత కేంద్రంలో ఐఈఆర్‌టీ కె.స్వాతి ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవంలో ఎమ్మెల్యే నానాజీ పాల్గొని ప్రత్యేకావసరాలు కలిగిన పిల్లలతో ఆటపాటలాడారు. పలు అంశాల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు, చేయూత స్వచ్ఛంద సంస్థ అందించిన ఉపకరణాలను అందజేశారు. విద్యార్థులు, పేరెంట్స్‌తో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, పెంకే శ్రీనివాసబాబా, చప్పిడి వెంకటేశ్వరరావు, నులుకుర్తి వెంకటేశ్వరరావు, రంబాల వెంకటేశ్వరరావు, దేవు వెంకన్న, మామిడాల వెంకటేష్, పబ్బినీడి వెంకటకృష్ణ, బండారు మురళి, ముద్రగడ రమేష్, బోగిరెడ్డి కొండబాబు, గంగాధర్, యాళ్ల పండు, ఎంఈవోలు బులికృష్ణవేణి, సత్యనారాయణ, ఆత్మ కమిటీ ఛైర్మన్ గొల్లపల్లి చంద్రశేఖర్, హెచ్ఎం రాజరాజేశ్వరి, ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఆత్మీయ సమావేశానికి విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మహ్మద్ షరీఫ్, భీమేశ్వరాలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ కంటే జగదీష్‌మోహన్ (బాబు), లయన్స్ క్లబ్ ఛైర్మన్ డాక్టర్ అమలకంటి శ్రీనివాసరావు, కౌన్సిలర్ బలుసు శ్రీనివాసు, టీడీపీ గౌరవాధ్యక్షుడు అడబాల కుమారస్వామి, నక్కా జానకిరామయ్య, పైల శ్రీనివాసు హాజరయ్యారు. డాక్టర్ అమలకంటి శ్రీనివాసరావు సౌజన్యంతో చక్కెర పొంగలి, పులిహోర అందజేసారు. తల్లిదండ్రులతో కలిసి ఉపాధ్యాయులు, విద్యార్థులు విందు స్వీకరించారు. పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాల, తోట గోపాలకృష్ణ మున్సిపల్ ఉన్నత పాఠశాల, వైఏఎంహెచ్ మున్సిపల్ పాఠశాల, మండలంలోని నవర జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పీటీఎం నిర్వహించారని ఎంఈవో పట్టపగలు పుల్లయ్య చెప్పారు.

కాకినాడ సిటీ (ఆంధ్రజ్యోతి): జగన్నాథపురంలోని కార్పొరేషన్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన అవధానం ఆకట్టుకుంది. విద్యార్థినుల మాటల చాతుర్యం, పద సమ్మేళనం, తక్షణ ప్రతిబింబ స్పందన ఆహూతులను ఆశ్చర్యానికి గురిచేశాయి. శబ్దాలానందం, ఛందోభంగిమ, అలంకార శోభతో నిండిన కవితా కదలికలు చిన్నారులకు భవిష్యత్తు సాహితీవేత్తలుగా పునాది వేస్తాయని పలువురు ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీనారాయణరావు విద్యార్థినుల ప్రతిభను ప్రశంసించారు. తెలుగు ఉపాధ్యాయులు గంగారామ్, సన్యాసిరావు, అనురాధలతో పాటు విద్యార్థినులను శాలువాలతో సత్కరించారు. జగన్నాథపురంలోని అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 'బడి పిలుపు-వికసిత్ ఆంధ్రకు మలుపు' పేరుతో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్సీ పద్మశ్రీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రిన్సిపాల్ చెక్కా మూర్తి రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు ధనకృష్ణారావు, బీఈ సౌజన్య, కృష్ణమనాయుడు, సుబ్బారావు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలోని పెగోడా స్కూలులో టీడీపీ డివిజన్ ఇన్‌చార్జి నల్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు స్నేహపూర్వక వాతావరణం కలిగి ఉండాలన్నారు. విద్యార్థుల నడవడిక, అభ్యాసన తీరు, ఇష్టాలు, నైపుణ్యాభివృద్ధి అంశాల్లో నిరంతర పర్యవేక్షణ ద్వారా వారి గమ్యాలకు దిక్సూచిగా నిలవాలన్నారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాలిగ్రామ లక్ష్మీప్రసన్న, జనసేన డివిజన్ ఇన్‌చార్జి సుంకర సురేష్, నగర అధికార ప్రతినిధి పిల్లారిశెట్టి రాజేశ్వరి, ఎస్ఎంసీ ఛైర్‌పర్సన్ దేవి, టీడీపీ నాయకులు నల్లూరి తులసి, ఆకెళ్ల ప్రసాద్, హెచ్ఎం సుభాషిణి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్ఆర్ బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలల్లో జరిగిన మెగా పీటీఎం-3.0లో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ పాల్గొన్నారు. క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులతో కలిపి సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు. ప్రిన్సిపాల్ కేశవరావు, నాయకులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు/పిఠాపురం (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో తల్లులకు విద్యార్థినులు మెహందీ (గోరింటాకు) పెట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పిఠాపురం పాతబస్టాండు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సాంస్కృతికప్రదర్శనలు అలరించాయి.

గొల్లప్రోలు/పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలలు, బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, గొల్లప్రోలు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలల్లో జరిగిన మెగా టీచర్ పేరెంట్ మీటింగ్‌ల్లో డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల బాబు, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జనసేన ఫైవ్‌మెన్ కమిటీ సభ్యుడు ఓదూరి కిషోర్ పాల్గొన్నారు. అధికారులు, విద్యా కమిటీల ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టమూరులో ఉపాధ్యాయులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు సత్కరించారు. పట్టణ పరిధిలోని సిద్ధార్థ మున్సిపల్ పాఠశాలలో నిర్వహించిన పీటీఎంలో వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ పాల్గొన్నారు. చదలాడలో ఎస్ఐ మౌనిక విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. రాయభూపాలపట్నంలో ఎస్ఎంసీ ఛైర్మన్ మన్యం చిన్న ఆధ్వర్యంలో క్రాఫ్ట్ విభాగంలో విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

కార్పొరేషన్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించిన పీటీఎంలో బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల కలిగే నష్టాలు, చిన్న వయసులో గర్భధారణ అనర్థాలు, బాలల హక్కులు, విద్య ప్రాముఖ్యత, చట్టపరమైన శిక్షలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహం జరుగుతుందనే సమాచారం తెలిసినప్పుడే తమ గళం వినిపించి అధికారులకు తెలియజేస్తామని తల్లిదండ్రులు ప్రతిజ్ఞ చేశారు. పిల్లల భద్రత, విద్య కొనసాగింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కూటమి నాయకులు, స్కూలు సిబ్బంది, ఐసీడీఎస్ సీడీపీవో ఎ.జ్యోతి, సూపర్‌వైజరు గౌరి, అంగన్వాడీ టీచర్లు, ఐసీడీఎస్ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పెద్దాపురం మండలం కట్టమూరులో ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు



కాకినాడ గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులకు బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



కాకినాడ జగన్నాథపురం బాలికోన్నత పాఠశాలలో అవధానంలో పాల్గొన్న విద్యార్థినిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ



పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో మాజీ ఎమ్మెల్యే వర్మ



గొల్లప్రోలు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో తల్లులకు గోరింటాకు పెడుతున్న విద్యార్థినులు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న సినీ నటి ఐశ్వర్య రాజేష్

తునిలో సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రారంభం

తుని రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో వస్త్రాభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్న సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ 36వ షోరూం తునిలో శుక్రవారం ప్రారంభమైంది. సినీ నటి ఐశ్వర్యరాజేష్, రేవంత్ (సంక్రాంతికి వస్తున్నాం ఫేమ్ బుల్లిరాజు) షోరూమ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు విచ్చేశారు. ఐశ్వర్యరాజేష్, రేవంత్ అన్ని విభాగాలను సందర్శించి వివిధ వస్త్రాలను పరిశీలించారు. ఐశ్వర్యరాజేష్ మాట్లాడుతూ సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ ప్రారంభించడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఎన్నో రకాల మోడల్స్, వస్త్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అన్ని తరగతుల వారికి అందుబాటు ధరల్లో వస్త్రాలు ఉండటం ఈ షోరూం ప్రత్యేకత అన్నారు. షాపింగ్‌మాల్ ఛైర్‌పర్సన్ హోల్‌టైం డైరెక్టర్ పొట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 36 షోరూమ్‌ల మైలురాయి దాటినందుకు సంతోషంగా ఉందన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ సిర్న రాజమౌళి మాట్లాడుతూ సరికొత్త వెరైటీలతో అందరికీ అందుబాటు ధరల్లో వస్త్రాలు తీసుకొచ్చామన్నారు. హోల్‌టైం డైరెక్టర్ తిరువీధుల ప్రసాదరావు మాట్లాడుతూ సరికొత్త ఫ్యాషన్ ప్రపంచంగా సౌత్‌ఇండియా షాపింగ్‌మాల్ పేరు గడించిందని, తుని పరిసరాల ప్రజలు సందర్శించి వస్త్రాలు కొనుగోలుచేయాలని కోరారు.

రాజకీయ ప్రతినిధులతో ఆర్డీవో సమీక్ష

పెద్దాపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్డీవో కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీవో కె.శ్రీరమణి శుక్రవారం సమీక్షించారు. ఓటర్ల వివరాలు, చేర్పులు, తొలగింపులు, సవరణలు, అభ్యంతరాలపై చర్చించారు.

మెరుగైన తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే నానాజీ

సర్పవరం జంక్షన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి లేకుండా ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదేశించారు. శుక్రవారం ఆయన రమణయ్యపేట మండల కార్యాలయంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ ఎండీ మెతిన్‌తో కలిసి ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ పనులపై సమీక్షించారు. కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలోని కాకినాడ రూరల్, తూరంగి, కరప మండలాల్లో సీపీడబ్ల్యు స్కీము ద్వారా ప్రజలకు సరఫరా అవుతున్న తాగునీటి రంగు, నాణ్యతపై పలు ఫిర్యాదులు వస్తున్నాయని, నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. పైపులైన్ల లీకేజీ నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో నిర్మించి అసంపూర్తిగా నిలిచిపోయిన పనులను కాంట్రాక్టర్లతో చెప్పి పూర్తి చేయించాలని కోరారు. అసంపూర్తి ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. నియోజకవర్గంలో సుమారు 20 ఓహెచ్ ఆర్‌లు నిర్మాణంలో ఉన్నాయని, మరో 20 పనులకు చర్యలు తీసుకోవాల్సి ఉందని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. అమృత్ పథకం, ఇంటింటా కుళాయి కనెక్షన్లు, కాంట్రాక్టర్లకు పెండింగు బిల్లుల చెల్లింపు అంశాలపై చర్చించారు. ఎంపీడీవో పసుపులేటి సతీష్, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ డి.శ్రీనివాసరావు, కాకినాడ రూరల్, కరప ఏఈలు మారుతీరామ్, వర్ధన్ పాల్గొన్నారు.

90 మందికి కంటి శస్త్ర చికిత్స

సామర్లకోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయం ఆవరణలో చైన్నైకి చెందిన శంకర నేత్రాలయం, ఎర్నేని చారిటబుల్ ట్రస్టు, నటరాజా నాట్యాంజలి (అమెరికా) సంయుక్త ఆధ్వర్యంలో వారం పాటు నిర్వహించిన కంటి పొర శస్త్ర చికిత్స శిబిరం శుక్రవారం విజయవంతంగా ముగిసింది. అంబులెన్స్ వాహనాల్లో 25 మంది నిపుణులు 90 మందికి శస్త్ర చికిత్స చేశారని ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ కంటే జగదీష్‌మోహన్ (బాబు), ఈవో బళ్ల నీలకంఠం తెలిపారు. శిబిరం కన్వీనర్ డాక్టర్ శివ ఆధ్వర్యంలో 1,500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 450 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు.



పోలీసు శాఖకు బారికేడ్ల వితరణ

కాకినాడ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని మాక్సివిజన్ కంటి ఆసుపత్రి ప్రతినిధులు 20 ట్రాఫిక్ బారికేడ్లను శుక్రవారం ఎస్పీ జి.బిందుమాధవ్‌కు అందజేశారు. ట్రాఫిక్ సిబ్బందికి గొడుగులు పంపిణీ చేశారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్.శ్రీనివాస్, కాకినాడ ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్‌పాటిల్, ఎస్‌బీ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ శ్రీహరిరావు, మాక్సివిజన్ హాస్పటల్ వైద్యురాలు డాక్టర్ అమృత, క్లస్టర్ హెడ్ అఖిల్ పాల్గొన్నారు.



నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

సామర్లకోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో నిత్యాన్నదాన పథకానికి కాకినాడకు చెందిన గెడ్డమనుగు లలితప్రసాద్, గెడ్డమనుగు బాలసత్యశివశ్రీ, కాంటూరి శ్యామలరావు రూ.లక్ష విరాళాన్ని ఈవో బళ్ల నీలకంఠానికి అందజేశారు. తొలుత వారు భీమేశ్వరస్వామిని, బాలాత్రిపురసుందరి అమ్మవారిని దర్శించుకున్నారు. దాతలకు వేదపండితులు ఆశీర్వచనం ఇవ్వగా స్వామి, అమ్మవార్ల చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ కంటే జగదీష్‌మోహన్ (బాబు), పండితుడు చెరుకూరి సుందరరామయ్య (రాంబాబు), సూపరింటెండెంట్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్థిక నేరాలపై అవగాహన

కాకినాడ రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆర్‌బీఐ ఏపీ శాఖ మేనేజరు ఎ.రామకృష్ణ కోరారు. కాకినాడ విద్యుత్ నగర్‌లోని ఐడియల్ డిగ్రీ కళాశాలలో ఆర్థిక నేరాల నియంత్రణపై విద్యార్థులకు శిక్షణలో భాగంగా శుక్రవారం ఆర్థిక అక్షరాస్యత అంశంపై ఆర్‌బీఐ ఏర్పాటుచేసిన సెమినార్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బ్యాంకుల్లో డబ్బులు దాచుకోవడం, వాటిని రక్షించుకోవడంపై చట్టపరమైన అవగాహన ఉండాలన్నారు. ఫేక్ కరెన్సీని సులువుగా గుర్తించడం, నోట్లు చిరిగినా, పాడైనా ఏవిధంగా మార్చుకోవాలి, ఫేక్ వెబ్‌సైట్లను గుర్తించడం, ఫేక్ కాల్స్‌పై ఫిర్యాదు చేయడంపై శిక్షణనిచ్చారు. యూనియన్ బ్యాంక్ శాఖ మేనేజరు సీహెచ్‌ఎస్వీ ప్రసాద్, కళాశాల డైరెక్టర్లు మెర్ల రంజిత్,కేఎస్ వాసు, వైస్ ప్రిన్సిపాల్ కామరాజు, మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి ఈ.శ్రీనివాసరావు, డిగ్రీ, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

మదర్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ లోగో ఆవిష్కరణ

కాకినాడ సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సాంబమూర్తి నగర్‌లోని ప్రభుత్వ బధిరుల ఉన్నత పాఠశాలలో మదర్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ లోగోను ఫౌండర్ నూతిక రాజు, నేతల ఉమా ఆవిష్కరించారు. విద్యార్థులకు అన్నదానం చేశారు. దినకర్, వసీం, ఖాన్, మనోహర్‌రాజ్, జాన్‌కుమార్, శేఖర్, సత్యనారాయణ, ప్రేమ్ స్వరూప్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ ముందస్తు వేడుకలు

సర్పవరం జంక్షన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రెండో డివిజన్ రమణయ్యపేటలో బెరాకా బ్లెస్సింగ్ చర్చిలో యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్షుడు దొమ్మేటి శామ్యూల్‌సాగర్ ఆధ్వర్యంలో క్రిస్మస్ ముందస్తు వేడుకలు నిర్వహించారు. బెరాకా చర్చి వ్యవస్థాపకుడు, యునైటెడ్ పాస్టర్స్ జిల్లా గౌరవాధ్యక్షుడు జోసెఫ్ బెన్నీ క్రిస్మస్ విశిష్టతను వివరించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, మాజీ మంత్రి కురసాల కన్నబాబు పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఏడు నియోజకవర్గాల నుంచి విచ్చేసిన యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు, ఎగ్జిక్యూటివ్ సభ్యులకు ప్రత్యేక బహుమతులు పంపిణీ చేశారు.

'సచివాలయాలకు వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలి'

కార్పొరేషన్ (కాకినాడ), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వివిధ సేవల కోసం సచివాలయాలకు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా, బాధ్యతతో వ్యవహరించాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనరు ఎస్వీవీ సత్యనారాయణ సూచించారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన మెహర్‌నగర్‌లోని 44వ వార్డు సచివాలయాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి మెరుగైన సేవలను అందించేందుకు సిబ్బంది శ్రద్ధ వహించాలని ఆదేశించారు. సచివాలయంలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంతో మాట్లాడి డివిజన్ పరిధిలో ఆరోగ్య పరిస్థితులు, సీజనల్ వ్యాధుల వివరాలు తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. సచివాలయానికి వచ్చే ఫిర్యాదులను ఆలస్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

31 నుంచి సీఐటీయూ జాతీయ మహాసభలు

కాకినాడ సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరిగే సీఐటీయూ 18వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఏపీ మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి దుంపల ప్రసాద్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ కోరారు. శుక్రవారం కలెక్టరేట్ గేటు వద్ద మహాసభల పోస్టర్లను వారు ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, సభ్యులు పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ, టి.రాజా, శ్రీనివాస్, శేఖర్, భారతీప్రియ, మేడిశెట్టి రాంబాబు, అంగన్వాడీ సంఘం నాయకులు జ్యోతి, రమణమ్మ, వెంకటలక్ష్మి, తలుపులమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాకతిప్ప మోడల్ స్కూలుకు కంప్యూటర్ బహూకరణ

కొత్తపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పీటీఎం 3.0లో భాగంగా వాకతిప్ప మండల పరిషత్ మోడల్ స్కూలుకు గ్రామానికి చెందిన పిట్టా సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన కుమారులు సురేష్, వెంకటేష్, రమేష్, కుమార్తె బుజ్జి రూ.22వేలు విలువచేసే కంప్యూటర్, ప్రింటర్ బహూకరించారు. దాతలను హెచ్ఎం అప్పారావు, ఉపాధ్యాయులు ఉమామహేశ్వరరావు, వీరబాబు, దుర్గారాణి అభినందించారు.

ఉద్యమ ఆధారితపై అవగాహన

తుని రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యమ ఆధారితతో చిన్న తరహా పరిశ్రమలకు ఆర్థిక సహాయం బ్యాంకుల ద్వారా సాధ్యప డుతుందని ఎంఎస్ఎంఈ ఏపీవో రాజేష్ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గ్రామీణ వాసులకు అవగాహన కల్పించారు. లాభాలు వివరిస్తూ వీటి ద్వారా లభించే రుణాల మంజూరుకు చేయాల్సిన చర్య లు వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం సత్తిబాబు తదితరులున్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు



జగ్గంపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెహ్రూ

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

మూడు ఆప్షన్లు ఇస్తున్నాం ... నిర్ణయం మీదే

● పోలవరం గ్రామసభలో స్పష్టం చేసిన పీవో శుభంనొఖ్వాల్



గ్రామసభలో మాట్లాడుతున్న పీవో

చింతూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చింతూరులో శుక్రవారం పోలవరం గ్రామసభ జరిగింది. ఐటీడీఏ పీవో శుభం నొఖ్వాల్ పాల్గొన్నారు. చింతూరు గ్రామ గిరిజనేతర నిర్వాసితుల పునరావాస కల్పన దిశగా తీసుకుంటున్న చర్యలను వివరించేందుకు ప్రత్యేక గ్రామసభ ఏర్పాటు చేశారు. పీవో మాట్లాడారు. ప్రభుత్వ నిర్ణయాలను, ఆ మేరకు నిర్వాసితులు ఎంపిక చేసే కొనేందుకు కల్పించిన మూడు ఆప్షన్లను వివరించారు. ఇప్పటికే తమ వద్ద చింతూరు గిరిజనేతర నిర్వాసితులైన 1365 కుటుంబాలు ఇచ్చిన పునరావాస కల్పన అంగీకార లిఖిత పూర్వకపత్రాలు ఉన్నాయన్నారు. వారంతా ఏలూరు జిల్లా తాడువాయిలో పునరావాస కల్పనకు అంగీకారం తెలియజేయడం జరిగిందన్నారు.

ఒడియా క్యాంపులో మోటార్‌కు మరమ్మతులు

● ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మోతుగూడెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం మేజర్ గ్రామ పంచాయతీ పరిధి ఒడియా క్యాంపులో ఉన్న మంచినీటి పథకం విద్యుత్ మోటార్ పని చేయకపోవడంతో ప్రజలు చాలా రోజుల నుంచి గ్రామస్థులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం పై 'ఆంధ్రజ్యోతి'లో తాగునీటికి కటకట... మరమ్మతులకు నోచుకోని బోరు వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో మోతుగూడెం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఆకేటి సీత గురువారం ఆ గ్రామాన్ని సందర్శించి విద్యుత్ మోటార్‌కు మరమ్మతులు చేయించారు.

పండగలా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లు

మోతుగూడెం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): డొంకరాయిలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన పేరెంట్స్ టీచర్స్ మెగా మీటింగ్ ఎంపీపీ స్కూల్, జిల్లా పరిషత్ స్కూల్, బాలికల ఆశ్రమ స్కూల్ నందు ఉపాధ్యాయులంతా పిల్లల తల్లిదండ్రులతో కలసి మనంగా నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎంపీటీసీ కరకా వెంకటరమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా హెచ్ఎంలు ప్రవీణ్, యర్రంరెడ్డి, నాగేంద్ర, తదితరులు ప్రసంగించారు.

వైరామవరం: మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్‌లను పండుగ వాతావరణంలో నిర్వహించారు. పి. ఎర్రగొండ గురుకుల కళాశాల, ఏకలవ్య పాఠశాల, పనసలపాలెం, యర్రగొండ, వై.రామవరం, బండిగెడ్డ, దాలిపాడు, కోట ఆశ్రమ, కేజీబీవీ పాఠశాలలు, వైరామవరం జూనియర్ కళాశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు జరిపి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మండల ప్రత్యేకాధికారి దయానంద్, ఎంపీడీవో బాపన్న దొర ఆయా సమావేశాల్లో పాల్గొని విద్యాప్రమాణాలపై తల్లిదండ్రులకు తగు సూచనలు చేశారు.

రాజవొమ్మంగి: మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో శుక్రవారం పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ పండగ వాతావరణంలో జరిగింది. పాఠశాల కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరగ్గా స్థానిక ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. తహశీల్దార్ అల్లు సత్యనారాయణ, ఎంపీడీవో యాదగిరేశ్వరరావు, సీఐ గౌరీ శంకర్, ఎస్ఐ శివకుమార్ కార్యక్రమాలకు హాజరయ్యారు.

రంపచోడవరం: పేరెంట్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమాన్ని పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశం విద్యాకమిటీ చైర్మన్ దడుమకు సుందరగింగ్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ఐటీడీఏ ఏపీవో(జ) డీఎస్ఎస్ రమణ, మండల ప్రత్యేకాధికారి షరీఫ్, సర్పంచ్ మంగా బొజ్జయ్య, ఎంఈవో ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. సమావేశంలో హెచ్ఎం శ్రీనివాసరావు, పాఠశాల వైస్ చైర్మన్ పి.ప్రవంతి, ఉపాధ్యాయులు సీతారామయ్య, కె.వెంకటేశ్వర్లు, భవాని, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: దుప్పలపాలెం ఎంపీపీఎస్, రాయపల్లి ఆశ్రమ, యూపీఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో పి.శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చొల్ల చిన్నబ్బాయి, ఉపాధ్యాయులు, పాఠశాల చైర్మన్, కమిటీ సభ్యులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎటపాక: ఉన్నత విద్యతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందని పాఠశాల హెచ్ఎం పండా సునీత, ఎస్ఎంసీ చైర్మన్ బాలరాజు అన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది రమాదేవి, భద్రమ్మ, లక్ష్మయ్య, సురేష్, వీర్రాజు, సావిత్రి, ప్రియాంక, శివ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అసలైన ఆదివాసీలకు అన్యాయం

దేవీపట్నం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఇందుకూరు పంచాయతీ కొండమొదలు ఆర్ అండ్ ఆర్ కాలనీని శుక్రవారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు కాక మధు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను సందర్శించారు. ఈ సందర్భంగా ఆదివాసీ హక్కులు, చట్టాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. పోలవరం ప్రాజెక్టులో ముంపునకు గురైన ఆర్ అండ్ ఆర్ కాలనీలో నివాసముంటున్న ప్రజలకు భూమికి భూమి ఇవ్వలేదని, ఆదివాసులకు పోలవరం నష్టపరిహారం చెల్లించలేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు యాలంగ్ల నాగేశ్వరరావు, నడిపూడి గాంధీ, బి.రామన్న దొర, సరే గంగరాజు, అబ్బాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి నిర్వాసిత కాలనీలో పరిశ్రమలు

కూనవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితుల ఉపాధి కోసం తాడ్వాయి కాలనీలో రెండు పరిశ్రమలు ఏర్పాటు చేయటానికి ప్రభుత్వం ముందుకు వచ్చిందని చింతూరు ఐటీడీఏ పీవో శుభం నొఖ్వాల్ తెలిపారు. శుక్రవారం నిర్వాసితులతో సమావేశాన్ని నిర్వహించారు. దీనిపై ఆదివారం మరోసారి సమావేశమవుతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎడవల్లి బాస్కరరావు, లంబు శ్రీను, మేకల నాగేశ్వరరావు, తాళ్లూరి శ్రీను, అవులు మరియదాసు, తదితరులు పాల్గొన్నారు.

పురోగతి లేకుంటే చర్యలు

వైరామవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుశాఖల అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిపై శుక్రవారం మండల ప్రత్యేకాధికారి దయానంద్ రివ్యూ జరిపారు. గృహనిర్మాణ, ఐ హెచ్ హెచ్‌పాల్, ఉపాధి హామీ, వెలుగు, నీటి ఆయోగ్, తదితర శాఖలలో ప్రతి వారం నిర్వహించే కార్యక్రమాలలో పురోగతి కనిపించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీడీవో బాపన్న దొర, ఏపీఎం లవన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ కాలనీ స్థలం పరిశీలన

రాజవొమ్మంగి డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పోలవరం ముంపునకు గురయ్యే చింతూరు గ్రామానికి ప్రత్యామ్నాయంగా మండలంలో ఇప్పటికే పలు స్థలాలను పరిశీలించారు. దీనిలో భాగంగా జడ్డంగి గ్రామంలో ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నిర్మించనున్న స్థలాలను, నిర్వాసితులకు ఇవ్వనున్న భూములను చింతూరు నుంచి నిర్వాసితులు వచ్చి పరిశీలించారు. అక్రిడిట్ బస్సులో సుమారు 70 మంది అధికారులు తీసుకువచ్చి భూములను చూపించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బాలకృష్ణ రెడ్డి, తహశీల్దార్ అల్లు సత్యనారాయణ, మండల వ్యవసాయాధికారి చక్రధర్, తదితరులు ఉన్నారు.

దబ్బపాలెంలో ఉపాధి పనుల పరిశీలన

అడ్డతీగల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వీరవరం గ్రామ పంచాయతీ దబ్బపాలెంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను శుక్రవారం ఎంపీడీవో పరిశీలించారు. ఉపాధి గ్రామీకులకు రోజుకు రూ.307 రావటానికి అవసరమైన కొలతలు ఫీల్డ్ అసిస్టెంట్ ద్వారా తెలియజేశారు.

'మరింత లోతుగా విచారణ చేపట్టాల్సి ఉంది'

చింతూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వైద్యుల పిర్యాదు మేరకు చింతూరు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డా. పుల్లయ్యపై విచారణ జరుగుతున్న విషయం విదితమే. ఈ మేరకు విచారణ అధికారి రెండో రోజైన శుక్రవారం డివిజనులోని కుటూరు, రేఖపల్లి, కూనవరం, నెల్లిపాక ప్రాథమిక వైద్యశాలలను సందర్శించి వైద్యులు, సిబ్బందిని విచారించారు. మరింత లోతుగా విచారణ చేపట్టాల్సి ఉందని, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డా. పుల్లయ్య వ్యవహార తీరులను ఆరా తెలుసుకున్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

మెగా పీటీఎం కార్యక్రమాలు

పాల్గొన్న ఎమ్మెల్యేలు, అధికారులు

తుని రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. తేటగుంట ప్రభుత్వ హైస్కూల్‌లో జరిగిన మెగా పీటీఎం కార్యక్రమంలో ఆమె విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. విద్యావిధానాల్లో సమూలమైన మార్పులు తీసుకొచ్చి విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుందని తెలిపారు. కార్పొరేట్ సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయన్నారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ప్రాజెక్టులను వీక్షించి అభినందించారు. పాఠశాలలో మిడ్డే మీల్స్ విద్యార్థుల హాజరు, ప్రోగ్రెస్ రిపోర్టులు తదితర అంశాలపై ఉపాధ్యాయులతో చర్చించి విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలని కోరారు. టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రాజేష్, మండలాధ్యక్షుడు చింతమనేడి అబ్బాయి, తేటగుంట మాజీ సర్పంచ్ గజ్జి అప్పలరాజు, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ చామంతి దుర్గారావు, టీడీపీ నాయకుడు గజ్జి రాంబాబు, పీఏసీఎస్‌అధ్యక్షుడు పేదిరెడ్డి వెంకటకృష్ణ, జనసేన నాయకులు గెట్ల శివ, చామంతి సత్తిబాబు, చింతలపూడి రాజు, పప్పు నవీన్ ఎంఈవో గీతాదేవి పాల్గొన్నారు.

చర్చించేందుకే సమావేశాలు

జగ్గంపేట (ఆంధ్రజ్యోతి): మెగా పేరెంట్సడే సమావేశాలు జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జరిగాయి. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హాజరయ్యారు. పలు విషయాలపై విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు చర్చించేందుకే ఈ ఆత్మీయ సమావేశాలని తెలిపారు. ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. జగ్గంపేట మండలం రామవరం జడ్పీ హైస్కూల్ ఆధ్వర్యంలో మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ జరిగింది. ముఖ్య అతిథి రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు అడబాల వెంకటేశ్వర రావు హాజరయ్యారు. కూటమి నాయకులు ఉన్నారు.



తుని రూరల్: తేటగుంట ప్రభుత్వ హైస్కూల్‌లో సైన్స్ ప్రాజెక్టులను తిలకిస్తున్న ఎమ్మెల్యే దివ్య

తొండంగి (ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖాధికారి ఆనిశెట్టి సుబ్బిరెడ్డి రావికంపాడు, కొమ్మనాపల్లి తదితర పాఠశాలల్లో జరిగిన మెగా పీటీఎం సమావేశాలకు హాజరయ్యారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, దాతలు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. బెండపూడి ప్రాథమిక పాఠశాల (నెంబర్ 1) పాఠశాలలో మధ్యాహ్న భోజనం బాగుందిలేదంటూ పీటీఎంకు హాజరైన పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు చర్యలు తీసుకుని మంచి భోజనం అందించాలని కోరారు.

లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

ఏలేశ్వరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పేర్కొన్నారు. పెద్దనాపల్లిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పీటీఎం సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి సమకూర్చిన క్రీడా దుస్తులను విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి పొంగలితమ్మ భోజనాన్ని స్వీకరించారు. పట్టణంలో బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, లింగంపర్తి, జె.అన్నవరం పాఠశాలల్లో తల్లిదండ్రులకు పిల్లలు పాదపూజ చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంపీడీవో రవికుమార్‌వర్మ, తహశీల్దార్ కుశరాజు, డిప్యూటీ ఎంపీడీవో రామరాజు వర్మ, ఎంఈవో అబ్బాయి, టీడీపీ మండలాధ్యక్షుడు జ్యోతుల పెదబాబు, నగర పంచాయతీ చైర్ పర్సన్ అలమండ సత్యవతి, కౌన్సిలర్లు అలమండ చలమయ్య, మూది నారాయణస్వామి, బొదిరెడ్డి గోపి, సుంకర సత్తిబాబు తదితరులున్నారు.



ఏలేశ్వరం: పెద్దనాపల్లి పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

విద్యకు పెద్దపీట

కిర్లంపూడి (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ విద్యకు పెద్దపీట వేస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ అన్నారు. కిర్లంపూడి కొత్తూరు రామకృష్ణగిరిరావు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రమణకుమారి ఆధ్వర్యంలో సర్పంచ్ గుడాల శ్రీలత రాంబాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతి.థులుగా జ్యోతుల నవీన్ కుమార్, జగ్గంపేట జనసేన పార్టీ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ విచ్చేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన తిలకించారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, వీరవరం సొసైటీ చైర్మన్ తోట గాంధీ, ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు, చదరం చంటిబాబు, కిర్లంపూడి సొసైటీ చైర్మన్ కర్ల చిన్నబాబు పాల్గొన్నారు. బూరుగుపూడి లోని జిల్లా పరిషత్ హైస్కూల్లో జరిగిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు యమ్.మధుబాబు, విద్యా కమిటీ చైర్మన్ వి.వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

శంఖవరం (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటుకు దీటుగా విద్యాబోధన జరుగుతుందని ప్రత్తిపాడు మార్కెట్ యార్డు చైర్మన్ బద్ది మణి రామారావు అన్నారు. మండలంలో ప్రతీ పాఠశాలలో మెగా పేరెంట్స్ డే నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు సాధించిన విజయాలు, సైన్స్ ప్రయోగాలను ప్రదర్శనకు ఉంచారు. శంఖవరంలో టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్, జనసేన నేత కరణం సుబ్రహ్మణ్యం, కత్తిపూడిలో రోడ్డు డెవలప్‌మెంట్ డైరెక్టర్ వెన్నా ఈశ్వరుడు, వజ్రకూటంలో కీర్తి వెంకటసుబాష్ హాజరై ప్రసంగించారు.



తొండంగి: పెరుమాళ్లపురంలో హాజరైన గ్రామస్తులు

కోటనందూరు (ఆంధ్రజ్యోతి): కోటనందూరు హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో లోవ దేవస్థానం మాజీ చైర్మన్ గాదిరాజుబాబు మాట్లాడారు. మాజీ ఎంపీపీ డి.విరంజీవిరాజు, డాక్టర్ వెలగా వెంకటకృష్ణారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ అంకంరెడ్డి రమేష్, పీఏసీఎస్‌సొసైటీ, సొసైటీ చైర్మన్ పెనుముచ్చు నాగేశ్వరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల సూరిబాబు, ఎంఈవో ఎర్రినాయన, ఎం.రామ్‌శేఖర్ పాల్గొన్నారు.

ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించాలని ఖాదీ గ్రామీణ పారిశ్రామిక కార్పొరేషన్ వైస్ చైర్మన్ కొమ్మిరి కన్నబాబు, తహశీల్దార్ సత్యప్రభ, ఎంపీడీవో ఎంపీఆర్ కుమార్‌బాబు, ఎస్ఐ లక్ష్మీకాంతం, ఎంఈవో వీరాజబాబు అన్నారు. మెగా పేరెంట్స్ ఆత్మీయ సమావేశాలు శుక్రవారం ప్రత్తిపాడు, ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించగా వారు పాల్గొన్నారు. విద్యా కమిటీ చైర్మన్లు, మాదే రాజేంద్రప్రసాద్, రామిశెట్టి నాగబాబు, సర్పంచ్ బెంతుకుర్తి సుశీల, మాజీ సర్పంచ్ యాళ్ల విశ్వేశ్వరరావు, మూరావర్రప్రసాద్, టీడీపీ సీనియర్ నాయకులు మదినే దొరబాబు, యర్రాబత్తుల గోవిందనాయుడు పాల్గొన్నారు.

తునిలో సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రారంభం

పాల్గొన్న సినీ నటులు ఐశ్వర్య రాజేష్, రేవంత్

తుని రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తునిలో సౌత్ ఇండియా షాపింగ్ మాల్ శుక్రవారం వైభవంగా ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో వస్త్రవిభాగాలను విశేషంగా ఆకట్టుకుంటున్న సౌత్ ఇండియా 36వ షోరూంను తునిలో ప్రారంభించింది. సినీ నటి ఐశ్వర్య రాజేష్, రేవంత్ (సంక్రాంతికి వస్తున్నాం పేమ్ బుల్లిరాజు) షోరూంను లాంఛనంగా ప్రారంభించారు. పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు విచ్చేశారు. ఐశ్వర్య రాజేష్, రేవంత్ షోరూంలో అన్ని విభాగాలను సందర్శించి వివిధ వస్త్రాలను పరిశీలించారు. ఐశ్వర్య రాజేష్ మాట్లాడుతూ సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రారంభించడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఎన్నో రకాల మోడల్స్, వస్త్రాలు అందుబాటులో ఉన్న వస్త్రాలు ఉండటం ఈ షోరూం ప్రత్యేకత అన్నారు. షాపింగ్ మాల్ చైర్‌పర్సన్ హోల్‌టైం డైరెక్టర్ పొట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తునిలో షోరూం ద్వారా 36 షోరూమ్‌లను పూర్తి చేశాము దాటినందుకు సంతోషంగా ఉందన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ సిర్న రాజమౌళి మాట్లాడుతూ సరికొత్త వెరైటీలతో అందరికీ అందుబాటు ధరల్లో వస్త్రాలు తీసుకొచ్చామన్నారు. హోల్‌టైం డైరెక్టర్ తిరువీదుల ప్రసాదరావు మాట్లాడుతూ సరికొత్త ఫ్యాషన్ ప్రపంచంగా సౌత్ ఇండియాషాపింగ్‌మాల్ పేరు గడించిందని, తుని పరిసర ప్రజలు తమ షోరూంను సందర్శించి వస్త్రాలు కొనుగోలు చేయాలని కోరారు.



జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభోత్సవానికి శ్రీకారం చుడుతున్న సినీ నటి ఐశ్వర్య రాజేష్

ప్రజాదర్బార్‌ను సద్వినియోగం చేసుకోండి : ఎమ్మెల్యే నెహ్రూ





ప్రజా దర్బార్‌లో ప్రజా సమస్యలను వింటున్న ఎమ్మెల్యే నెహ్రూ , తునిలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే దివ్య

గండేపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):గండేపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హాజరయ్యారు. అధికసంఖ్యలో ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరై వినతులు సమర్పించారు. ప్రజల తెలియజేసిన సమస్యలను ఎమ్మెల్యే ఓపి కగా విన్నారు. సంబంధిత శాఖల అధికారులకు సదరు సమస్యల పరిష్కారానికి సూచనలు చేశారు. పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. సమస్యల పరిష్కారానికి ప్రతి శుక్రవారం జగ్గంపేట రావులమ్మనగర్‌లోని క్యాంప్ ఆఫీస్‌తో పాటు, ప్రతి మండల కేంద్రంలో ఏదో ఒకచోట ప్రజాదర్బార్ ఏర్పాటుచేస్తామని ఈ అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో భాగంగా మొత్తం 156 వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు, జడ్పీటీసీ పరిమి మంగతాయారు బాబు, ఎంపీపీ చలగందొరబాబు, ఎస్సీఎస్ అప్పలరాజు, కుంచే రాజా, అడబాల బాస్కరరావు, కొత్తకొండబాబు, ఎమ్మార్వో శ్రీనివాసరావు, ఎండీవో హరికృష్ణ సత్యారెడ్డి, అధికారులు, సర్పంచ్ లు, టీడీపీ సభ్యులు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చేపూరులో ఎమ్మెల్యే ప్రజా దర్బార్

తుని రూరల్(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలు పరిష్కారంకోసం తుని ఎమ్మెల్యే యనమల దివ్య అధ్యక్షతన చేపూరు గ్రామంలో వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు వినతులు సమర్పించారు. వాటిని ఆమె అక్కడిక్కడే సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాల ని కోరారు. ప్రజాసంక్షేమ కార్యక్రమాలు ప్రతి ఒక్కరికీ అందేదిశగా కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండ్రు నాగేశ్వరరావు, పక్కుర్తి శ్రీను, పంపనబోయిన చంటి, బుద్ధాల నవీన్, కొల్లు బాల్లి, కుండల వెంకటేష్ తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే సత్యప్రభ

ఏలేశ్వరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. శుక్రవారం పెద్దనాపల్లి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.160 లక్షలతో బీటీ రోడ్డు, సీసీ రోడ్డు, పంచాయతీ ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అదియాత్కాలనీలో నూతనంగా నిర్మించిన మినీ తాగునీటి ట్యాంకును ఆమె ప్రారంభించారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, ఎంపీడీవో రవి కుమార్ వర్మ, తహశీల్దార్ కుశరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు జ్యోతుల పెదబాబు, మేడిశెట్టి సూర్యకిరణ్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



పెద్దనాపల్లిలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ఆదిత్య యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



డాక్టర్ ఎస్.కార్తిక్

గండేపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఈసీఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఎస్‌కార్తిక్ ఎన్ఐటీ సిల్చార్ అస్సాం నుంచి డాక్టరేట్ సాధించినట్లు ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొఫెసర్ డాక్టర్ బ్రింద బోయిక్, డాక్టర్ పి.షప్రాదేవి నేతృత్వంలో ఎస్‌కార్తిక్ సమర్పించిన శీర్షిక కంప్రెహెన్సివ్ డిజైన్ అఫ్ నానో స్కేల్ హెటిరో జంక్షన్ డ్యూయల్ గేట్ వర్టికల్ టీఎఫ్ఈటీ. అనలిటికల్ మోడలింగ్, సెన్సింగ్ ఫంక్షనాలిటీ, అండ్ సర్క్యూట్ లెవెల్ ఇంటిగ్రేషన్ అనే అంశంపై డాక్టరేట్ ఆఫ్ ఫిలాసఫీ పొందారని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ కార్తిక్‌ను యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ ఎన్‌శేషారెడ్డి, డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తదితరులు అభినందించారు.

ఎన్‌కౌంటర్ నిజ నిర్ధారణకు వెళ్లిన విద్యార్థులను అడ్డుకోవడం తగదు

ప్రత్తిపాడు , డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌పై నిజ నిర్ధారణ కోసం వెళ్లిన విశ్వ విద్యాలయ విద్యార్థులను అక్రమంగా నిర్బంధించడంపై ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్(ఐలాజ్) ఖండించింది. ఐలాజ్ రాష్ట్ర కార్యదర్శి బుగతా శివ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థి నాయకులను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికం అన్నారు. అరెస్ట్ అయిన విద్యార్థులను బేషరతుగా విడుదల చేయాలని, నిజ నిర్ధారణ చేసుకోవడానికి అడ్డంకులు కల్పించవద్దన్నారు.

మార్చిలోపు ఆయిల్ పామ్ తోటలు వేసుకోవాలి

● రైతులకు శిక్షణ కార్యక్రమం

జగ్గంపేటరూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం సీతానగరం గ్రామంలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్‌వారి ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం ముఖ్యఅతిథిగా కపిల్ శుక్లా, జనరల్ మేనేజర్ నాయుడు పాల్గొన్నారు. పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ హెడ్ ప్లాంటేషన్ విష్ణువర్ధనరెడ్డి మాట్లాడుతూ మెట్ట ప్రాంతంలో ఆయిల్ పామ్ మొక్కలు వేసుకోవడానికి అనువైన నేలలు చాలా ఉన్నాయని, ఇంపోర్టెడ్ మొక్క లు అందుబాటులో ఉన్నాయని మొక్కలు వేసుకునే రైతులు ఈ మార్చిలోపు వేసుకోవాలని, ఆయిల్ పామ్ పంట రైతుకు ఒక పాడి కుండలాంటిది అని ఒక్కసారి మొక్కనాటితే ముప్పై సంవత్సరాలు రైతుకు ఆదాయం ఇచ్చే పంట ఆయిపామ్ అని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి ఎ.శ్రీవల్లి మాట్లాడుతూ ఉద్యానశాఖ ద్వారా ఆయిలపామ్ విస్తరణ పథకం ద్వారా మొక్కలు 100 శాతం పూర్తి సబ్సిడీపై, మొక్కల నిర్వహణకు 1 హెక్టారుకు రూ.5250లు అంతర సాగుకు 2 హెక్టార్ల వరకు రూ.71,000 సుమారుగా నాలుగు సంవత్సరాలకు ఇస్తారని ఏడు సంవత్సరాలపైబడిన తోటలలో కోకో అంతర పంటకు 1 హెక్టారుకు రూ.30వేలు సబ్సిడీ అందుబాటులో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజీఎమ్ ఏఎస్ ప్రకాష్, రవీంద్ర, పతంజలి సిబ్బంది, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

సింగరంపాలెంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం



విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

కొండబాబు, కుంచే రాజా, అడ బాల బాస్కర రావు, పిల్ల ఉంగరాల రాము, పిల్ల చంటిబాబు, ఎస్.ఈ ప్రసాద్, ఈఈ వీరభద్రరావు, ఏడి మాలకి, గండేపల్లి ఏఈ కిరణ్ కిషోర్, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గండేపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):గండేపల్లి మండలం సింగరంపాలెంలో శుక్రవారం 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ రూ.3.29కోట్లతో నిర్మించిన ఈ సబ్‌స్టేషన్ సుమారు మూడు గ్రామాలకు ఉపయోగపడుతుందని తెలిపారు. లోఓల్టేజ్ సమస్యతో బాధపడుతున్న సింగరంపాలెం, రామయ్యపాలెం, కె.గోపాలపురం గ్రామాలకు విద్యుత్ సమస్యలు తీర్చేందుకు విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించడానికి అందించిన కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్, గండేపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు పోతుల మోహనరావును అభినందించారు. ఆదేవిధంగా గండేపల్లిలో ఐదు ఎకరాల స్థలంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు, ఎస్సీఎస్ అప్పలరాజు, కొత్త

రెండున్నరేళ్లయినా అందని సాగరమాల పరిహారం

● ఇద్దరు రైతుల ఆవేదన

అన్నవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం సాగరమాల ప్రాజెక్టుకు సంబంధించి ఛాసేకరణలో భూములు కోల్పోయిన ఇద్దరురైతులకు నష్టపరిహారం ఇంకా అందకపోవడంపై వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అనేకమంది పరిధిలో ఉన్న భూములకు పరిహారం ఇచ్చి అన్నవరం పరిధిలో ఉన్న తమభూములకు పరిహారం అందలేదని 2.4 ఎకరాలకు ప్రస్తుత మార్కెట్ ప్రకారం సుమారు రూ. 3.5 కోట్లు రావలసి ఉందని రైతు బందారు ముత్యాలరావు పేర్కొన్నారు. శంఖవరం జిల్లా కలెక్టర్ కోర్టు పరిధిలో విచారణ ఉన్నందున నేటికీ పరిహారం అందజేస్తారని ఆశిస్తున్నట్లు ముత్యాలరావు పేర్కొన్నారు.

